# భారత గౌరవాన్ని ఇనుమడింపజేస్తున్న ఇస్రో

## (23 ఆగష్టు "ఇస్రో దినోత్సవం" సందర్భంగా)

"భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ" లేదా "నేషనల్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్" లేదా "ఇస్రో (ఐఎస్ఆర్ఓ)" అన పేరుతో ఒక ప్రతిష్టాత్మక అంతరిక్ష సంస్థ 1969లో ఏర్పడింది. ఇస్రో ఏర్పడి నేటికి 56 ఏండ్ల విజయవంతమైన అంతరిక్ష యాత్ర జరిగింది. ఐదున్నరా దశాబ్దాలకు పైగా ఇస్రో సాధించిన విజయాలను నెమరు వేసుకోవడంతో పాటు భవిష్యత్తు ప్రయోగాల ప్రణాళికలను తెలుసుకుంటూ ఈ దినోత్సవాలను జరుపుకుంటాం. 1975లో ఇస్రో చేపట్టిన ప్రతిష్టాత్మక "ఆర్యభట్టా" ప్రయోగంగా ద్వారా తొలిసారి భారత ఉపగ్రహం అంతరిక్షంలోకి దూసుకుపోయింది. నాటి ఆర్యభట్టా నుంచి మొదలైన ఇస్రో ప్రయోగ పరంపరలో భాగంగా చంద్రయాన్-3, మంగళ్‌యాన్, ఆదిత్య-ఎల్1 లాంటి పలు ఎన్నో విజయవంతమైన ప్రయోగాలను చేపట్టిన ఇస్రో రానున్న రోజుల్లో మానవ సహిత ఉపగ్రహం ప్రయోగంతో చంద్రుడిపై భారత పాదాలను పెట్టడానికి విశేష కృషి జరుగుతోంది. ఇప్పటి వరకు ఇస్రో చేపట్టిన ప్రధాన ప్రయోగాల్లో మంగళ్‌యాన్, చంద్రయాన్-1 (2008), చంద్రయాన్-2(2019), చంద్రయాన్-3 (2023), ఒకే పిఎస్ఎల్‌వి-సి37 ప్రయోగంలో 104 ఉపగ్రహాలను కక్షలో చేర్చడం, ఇన్సాట్ వ్యవస్థ అభివృద్ధి, ఆదిత్య-ఎల్1, జిఎస్ఎల్‌వి లాంటి మరెన్నో మెసైల్స్ ద్వారా ఉపగ్రహాలను నిర్దేశంతో కక్షలోకి చేర్చడంలో సఫలీకృతం కావడం చూసాం.

### ఇస్రో దినోత్సవం-2026

### ఇతివృత్తం:

2026 ఇస్రో దినోత్సవం ఇతివృత్తంగా "వికసిత్ భారత్ సాధనలో ఆవిష్కరణలు, సమన్వయంతో భారత అంతరిక్ష రంగంలో ప్రగతి పరుగులు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. భారత దేశ అభివృద్ధి మాత్రమే ఏకైక లక్ష్యంగా అప్రతిహత ప్రయాణం చేస్తున్న ఇస్రో ద్వారా ఆధునిక అంతరిక్ష టెక్నాలజీని అన్వేషించి అంతర్జాతీయ అంతరిక్ష సంస్థల సహకార సమన్వయంతో ముందుకు దూసుకుపోతున్నది మనందరికీ గర్వకారణమైన ఇస్రో సంస్థ. ఇస్రో అంతరిక్ష పరిశోధనలతో మానవాళికి అంచనాకు అందనంత ప్రయోజనం కలుగుతోంది. కమ్యూనికేషన్స్, వాతావరణ మార్పులను అంచనా వేయడం, వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడం, టీవీ ప్రసారాలు, స్మార్ట్‌ఫోన్ పునాదులు, ఆన్‌లైన్ అద్భుతాలు, వాతావరణ మార్పులను పసిగట్టడం, టెలీమెడిసిన్, పర్యావరణ పరిరక్షణ, ముందస్తు వాతావరణ వార్తలకు అవకాశం కల్పిస్తా విపత్తులను ముందస్తు గుర్తించి నష్ట నివారణ చర్యలను చేపట్టడానికి అవకాశం కల్పించడం లాంటి అమూల్య సేవలను అందిస్తున్న ఇస్రో సంస్థను ఎంత కొనియాడినా తక్కువ అవుతుంది.

ఇస్రో శాస్త్రజ్ఞులు, వ్యోమగాములు, అంతరిక్ష పరిశోధకుల మేధో శక్తికి హద్దులు లేవు, సాధించని లక్ష్యాలు లేవు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ దినదినం ప్రవర్ధమానంగా ముందడుగు వేస్తున్న ఇస్రో భాద్యులకు శతకోటి వందనాలు. రానున్న రోజుల్లో ఇస్రో మరిన్ని మైలురాళ్లు దాటుతూ సమస్త భారతానికి గర్వకారణంగా నిలుస్తూ, మన జాతీయ జెండాను అంతరిక్షంలో రెపరెపలాడే విధంగా నిలపాలని కోరుకుందాం. ఓటమి ఎరుగని ఇస్రో కలలు సాకారం కావాలని కోరుకుందాం.



-మధుపాళీ
9949700037

# పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి.

**-ఏఈఆర్ఓలు పోలింగ్ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలి.**
**-ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి.**
**-బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి.**
**-పాలంపేట, చల్వాయి పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన భారత ఎన్నికల సంఘం కార్యదర్శి.**
**-నవీన్ కుమార్, కార్యదర్శి, భారత ఎన్నికల సంఘం.**







ములుగు ఆగష్టు 22:(నేటి నిజం ప్రతినిధి): ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సహాయ ఎన్నికల నమోదు అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు.

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించేందుకు తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్,శనివారం ములుగు జిల్లాలో పర్యటించారు.

జిల్లా పర్యటనలో భాగంగా ముందుగా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను నవీన్ కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిస్థితి, ఓటర్లకు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, బీఎల్ఓల పనితీరు తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులతో మాట్లాడి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో చేపడుతున్న క్షేత్రస్థాయి కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చల్వాయి గ్రామ ప్రజలతో కూడా ఆయన ప్రత్యక్షంగా మాట్లాడారు. ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాల పరిశీలన, మార్పులు, చేర్పులు, అభ్యంతరాలకు సంబంధించిన అంశాలపై క్షేత్రస్థాయి పరిస్థితిని తెలుసుకున్నారు. బీఎల్ఓలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని నవీన్ కుమార్ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు, లోటుపాట్లు ఉంటే ముందుగానే గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఏఈఆర్ఓలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలని, కేవలం కార్యాలయ స్థాయి సమీక్షలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో బీఎల్ఓల పనితీరు, ఓటర్లకు అందుతున్న సేవలు, పోలింగ్ కేంద్రాల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని సూచించారు.

అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నవీన్ కుమార్, కార్యదర్శి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ?2026 పురోగతిపై ఏఈఆర్ఓలు, సంబంధిత ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, డూప్లికేట్‌గా నమోదైన వారి వివరాలను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.

109-ములుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 308 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అధికారులు సమీక్షలో వివరించారు.

ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 2,09,128 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,01,964 మంది పురుషులు, 1,07,143 మంది మహిళలు, 21 మంది ఇతరులు ఉన్నట్లు తెలిపారు.

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో 11,308 నో మ్యాపింగ్ కేసులు, 30,326 అనామలీస్ కేసులు కలిపి మొత్తం 41,634 కేసులు ఉన్నాయని అధికారులు వివరించారు. వీటిపై విచారణ నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

నో మ్యాపింగ్, అనామలీస్ కేసులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి కేసులో వాస్తవ పరిస్థితిని నిర్ధారించిన అనంతరమే నిర్ణయం తీసుకోవాలని నవీన్ కుమార్ సూచించారు.

ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ అంశాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

బీఎల్ఓలు తమ పరిధిలోని ప్రతి ఓటరుకు అందుబాటులో ఉండాలని, ఓటర్ల జాబితాలో వివరాలకు సంబంధించి ప్రజలకు అవసరమైన సమాచారం, సహకారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత ఏఈఆర్ఓలు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి దశను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని, ఓటర్ల జాబితా స్వచ్ఛత, ఖచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ కృష్ణవేణి, 10 మండలాల తహసీల్దార్లు, ఎలక్షన్ సెల్ పర్యవేక్షకులు సలీం, డిటి నితీష్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుకపై ఉన్న శ్రద్ధ కొందరు అటవీ అధికారులకు అడవులపై లేదు

**-ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో వేధింపుల ఆరోపణలు**
**-స్థానిక ప్రజల అవసరాలను గుర్తించాలని డిమాండ్**



ఆదిలాబాద్, ఆగష్టు 22: ఇసుకపై ఉన్న శ్రద్ధ కొందరు అటవీ అధికారులకు అడవులపై లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో అటవీ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై స్థానికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అటవీ ప్రాంతాల సంరక్షణపై దృష్టి పెట్టాల్సిన అధికారులు.. అడవులకు వెలువల ఉన్న వాగులు, గోదావరి నదిలోని ఇసుకను స్థానిక అవసరాల కోసం ట్రాక్టర్ల ద్వారా తీసుకెళున్న వారిని పట్టుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఓ సర్కిల్ అటవీ ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ఇద్దరు అటవీ అధికారులు ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని అడవులను కలుపుతూ 2012లో అప్పటి ప్రభుత్వం జన్నారం అటవీ డివిజన్ కేంద్రంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ను ఏర్పాటు చేసింది. మొత్తం 2015.44 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఈ టైగర్ రిజర్వ్‌లో బఫర్ ఏరియా 1023 చదరపు కిలోమీటర్లు, కోర్ ఏరియా 892.44 చదరపు కిలోమీటర్లుగా ఉంది. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో పలు నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ, వాటిని సాకుగా చూపుతూ అటవీ ప్రాంతం వెలుపల ఉన్న ఇసుకపై మాత్రమే కొందరు అధికారులు దృష్టి సారిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

టైగర్ రిజర్వ్ ఏర్పాటై దాదాపు 15 ఏళ్లు గడుస్తు న్నప్పటికీ, గత ఆరు నెలలుగా ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై దృష్టి పెట్టాల్సిన అధికారులు.. గోదావరి ఇసుక, వాగుల నుంచి ప్రజలు తమ అవసరాల కోసం తీసుకెళ్లే ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడంపైనే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. సహజ వనరుల సంరక్షణలో గనులు, భూగర్భ శాఖ, రెవెన్యూ, పోలీస్ శాఖలకు కూడా బాధ్యతలు ఉన్నప్పటికీ.. కేవలం అటవీ శాఖ అధికారులు మాత్రమే ఇసుక రవాణాపై చర్యలు తీసుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎకో సెన్సిటివ్ జోన్ నిబంధనల్లో భాగంగా స్థానిక ప్రజల అవసరాలకు సహజ వనరులను వినియోగించుకునే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఓ పర్యావరణ శాస్త్రవేత్త, విశ్రాంత అటవీ ఉన్నతాధికారి ఆంధ్రప్రభకు తెలిపారు.

గ్రామాలు ఏర్పడిన తర్వాతే కవ్వాల్ టైగర్ రిజర్వ్, ఎకో సెన్సిటివ్ జోన్ నిబంధనలు అమల్లోకి వచ్చాయని, స్థానిక ప్రజల అవసరాలను కూడా అధికారులు గుర్తించాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వం పేదలకు పక్కా ఇళ్లు నిర్మించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వాగులు, గోదావరి నుంచి ఇసుక తీసుకొస్తున్న ట్రాక్టర్లను కూడా అటవీ అధికారులు పట్టుకుంటున్నారని జన్నారం మండల ప్రజలు, నాయకులు, సామాజిక ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లను 10 రోజుల నుంచి రెండు నెలల వరకు కస్టడీలో ఉంచడంతో పాటు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానాలు విధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు తెలిపారు. ఈ విషయంపై నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతిపత్రాలు అందించి తమ సమస్యలను వివరించారు. ఇసుక విషయంలో ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని ఎమ్మెల్యే పలుమార్లు హెచ్చరించినప్పటికీ అధికారుల తీరులో మార్పు రాలేదని సమాచారం. దీంతో ఎమ్మెల్యే రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సంబంధిత అటవీ శాఖ ఉన్నతాధికారి త్వరలో బదిలీ కానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో స్థానిక ప్రజల సమస్యలను అటవీ శాఖ అధికారులు గుర్తించి పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. లేకుంటే ప్రజల్లో మరింత అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు..

**-ఉట్నూర్ ఏ ఎస్పి ఆధ్వర్యంలో డివిజన్లో ముమ్మరంగా తనిఖీలు**

ఆదిలాబాద్, ఆగష్టు 22:ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఏఎస్పీ రుత్విక్ సాయి ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి, నార్నూర్, గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక వాహన తనిఖీలు, గ్రామాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు చేపట్టారు.

ఇంద్రవెల్లి మండలంలోని డొంగర్‌గావ్ గ్రామ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో నంబర్ ప్లేట్లు సక్రమంగా లేని 37 ద్విచక్ర వాహనాలను గుర్తించారు. నంబర్ ప్లేట్ లేని ఒక మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు.

నార్నూర్ మండలం మల్లెంగి గ్రామ పరిధిలో చేపట్టిన తనిఖీల్లో నంబర్ ప్లేట్లు సరిగా లేని 30 మోటార్‌సైకిళ్లు, నాలుగు ఆటోలను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై రూ.11,265 జరిమానా విధించడంతో పాటు 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గుడిహత్నూర్ మండలంలోని ముత్నూర్ తండా గ్రామ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో నంబర్ ప్లేట్లు సక్రమంగా లేని 32 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను గుర్తించి చర్యలు తీసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. అలాగే ఓ బెల్ట్ షాప్‌పై చర్యలు తీసుకుని, నంబర్ ప్లేట్లు లేని నాలుగు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఈ ప్రత్యేక తనిఖీలు, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లలో సంబంధిత సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బందితో పాటు టీజీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారని ఏఎస్పీ రుత్విక్ సాయి తెలిపారు.

# సవరించిన విధానం కింద రూ. 4,895.65 కోట్ల విలువైన 29 విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు

న్యూఢిల్లీ, ఆగష్టు 22:సవరించిన నిబంధనావళి ప్రకారం 2026 ఆగష్టు 20 నాటికి మొత్తం 29 ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు రానున్నాయి. ఈ ప్రతిపాదిత పెట్టుబడుల విలువ రూ. 4,895.65 కోట్లు. సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, సమాచార-కమ్యూనికేషన్, తయారీ రంగం, ఔషధ రంగం, డేటా సెంటర్లు, రవాణా సేవల వంటి విభిన్న రంగాలకు చెందిన పెట్టుబడులు ఇందులో ఉన్నాయి.

మారిషస్, అమెరికా, కొరియా రిపబ్లిక్, జపాన్, సింగపూర్, లగ్జెంబర్గ్, కేమాన్ దీవుల వంటి పలు ప్రాంతాలకు చెందిన పెట్టుబడిదారులు/ సంస్థల నుంచి ఈ 29 పెట్టుబడులు నమోదయ్యాయి. భారత్‌తో భూతల సరిహద్దు ఉన్న దేశాలకు చెందిన, నియంత్రణాధికారం లేని, 10 శాతం వరకూ వాటా ఉన్న యాజమాన్యాల పెట్టుబడుల విషయంలో.. ప్రభుత్వ ముందస్తు అనుమతి పొందాల్సిన నిబంధనను ఈ సవరణ ద్వారా తొలగించారు. తద్వారా భారత్‌లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం మరింత సులభతరమూ, వేగవంతమూ అవుతుంది. ఈ సంస్కరణ ద్వారా పెట్టుబడిదారులకు స్పష్టత లభించడం తోపాటు.. లావాదేవీల సమయం తగ్గి, దేశంలో వ్యాపార నిర్వహణ మరింత సులభతరమవుతుంది.

2026 మే 1న ప్రకటించిన పత్రికా ప్రకటన - 2 (2026), తదనుగుణంగా విదేశీ మారక ద్రవ్య నిర్వహణ (రుణేతర సాధనాలు) నిబంధనలు-2019కి చేసిన సవరణ ద్వారా.. లబ్ధిదారు యాజమాన్య పరీక్షను ఇకపై పెట్టుబడిదారు సంస్థ స్థాయిలోనే వర్తింపజేస్తారు. భారత్‌తో భూ సరిహద్దు ఉన్న దేశాలకు చెందిన, నియంత్రణాపరమైన అధికారం లేని, 10 శాతం వరకూ యాజమాన్య వాటా ఉన్న పెట్టుబడిదారులు... నిర్దిష్ట రంగానికి చెందిన గరిష్ట పరిమితులు, ప్రవేశ మార్గాలు, ఇతర షరతులకు లోబడి, ప్రభుత్వ ముందస్తు అనుమతి అవసరం లేకుండానే పెట్టుబడులు పెట్టవచ్చు. దీనికి సంబంధించి అవసరమైన వివరాలను ప్రభుత్వానికి నివేదించిన అనంతరం.. ఎలాంటి ఇతర అనుమతులు పొందాల్సిన అవసరం లేకుండానే పెట్టుబడిదారు సంస్థ ముందుకు సాగవచ్చు.

గతంలో భారత్‌తో భూ సరిహద్దు ఉన్న దేశాలకు చెందిన యాజమాన్యం వాటా ఎంత స్వల్పంగా ఉన్నప్పటికీ... పత్రికా ప్రకటన - 3 (2020) ప్రకారం, విదేశీ పెట్టుబడిదారులు తప్పనిసరిగా ప్రభుత్వ ముందస్తు అనుమతి పొందాల్సి వచ్చేది.

# పండుగల వేళ చక్కెర ధర పెరుగుదల నిరోధం.. తగిన లభ్యత దిశగా ప్రభుత్వ చర్యలు

న్యూ ఢిల్లీ, ఆగష్టు 22:దేశ వ్యాప్తంగా ఇటీవల చక్కెర ధర పెరిగింది. ఈ మేరకు జూలై 20న కిలో 48.18గా ఉన్న ధర ఆగష్టు 20 నాటికి 55. 70కి చేరింది. ఈ పరిస్థితిని నిశితంగా గమనిస్తున్న ప్రభుత్వం ధరను స్థిరీకరించడంతో పాటు ప్రజలకు చక్కెర తగినంత అందుబాటులో ఉంచుతూ అనేక చర్యలు చేపట్టింది.

వాస్తవానికి ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించే చెరకు వాటా 2022-23లో సుమారు 12 శాతం కాగా, 2025-26కల్లా సుమారు 9 శాతానికి దిగివచ్చింది. అంతే గాక దేశంలో ఇథనాల్‌ను దాదాపు మూడు వంతులు ధాన్యాలు.. ముఖ్యంగా మొక్కజొన్న ద్వారా ఉత్పత్తి చేస్తున్నారు.

చక్కెర ధర పెరుగుదలకు అనేక కారణాలున్నాయి: అంచనాల కన్నా దేశీయ ఉత్పాదనలో తగ్గుదల, పండుగ సీజన్ ముందు పెరిగిన డిమాండ్, వాతావరణ పరిస్థితుల వల్ల చెరకు పంటకు వాటిల్లిన నష్టం, ప్రపంచవ్యాప్తంగా చక్కెర సరఫరాలో తగ్గుదల పరిశ్రమలోని కొన్ని వర్గాలు ధర పెరుగుదలపై అంచనాలతో వ్యాపారం లేదా అక్రమ నిల్వ చేయడం వంటివి ప్రస్తుత పరిస్థితికి దారితీశాయి.

చెరకు సాగుచేసే రాష్ట్రాల్లో దిగుబడి ఈ ఏడాది సుమారు 343 లక్షల టన్నులుగా ఉంటుందని తొలుత అంచనా వేయగా, తాజా అంచనాల మేరకు 306 లక్షల టన్నులకు పరిమితం కాగలదని భావిస్తున్నారు. చెరకుపై ఎర్ర కుళ్లు తెగులు, కాండం తొలచు పురుగు దాడి సహా అధిక వర్షాలతో నీరు నిల్వ ఉండిపోవడం వల్ల దిగుబడిపై దుష్ప్రభావం పడింది. చెరకు దిగుబడి అంచనాలకన్నా తగ్గినా అక్టోబరులో కొత్త క్రషింగ్ సీజన్ మొదలయ్యే దాకా దేశీయ అవసరాలు తీర్చడానికి సరిపడా చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నాయి. చక్కెర సరఫరా తగ్గుదల అంతర్జాతీయంగా తలెత్తిన సమస్య తప్ప కేవలం మన దేశానికి పరిమితమైనది కాదు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ఖమ్మం, ఆగష్టు 22:పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పిలుపునిచ్చారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.

అనంతరం మాట్లాడుతూ.. జిల్లా పోలీస్ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణంగా తీర్చిదిద్దడం ద్వారా పోలీస్ సిబ్బందితో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజలకు సైతం మంచి వాతావరణం కల్పించవచ్చన్నారు. మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్.ఐ లు మధుకర్, సురేష్, రమేష్, సి.ఐ లు మొగిలి, మధుకర్, ఎస్.ఐ లు కిరణ్ కుమార్, ఆర్.ఎస్.ఐ లు రాజు, శ్రవణ్ , సాయికిరణ్, దిలీప్,రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మైసూరులో పౌర విమానయాన శాఖ సలహా కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు




న్యూఢిల్లీ, ఆగష్టు 22:కర్ణాటకలోని మైసూరులో పౌర విమానయాన మంత్రిత్వశాఖ పార్లమెంటరీ సలహా కమిటీ సమావేశం ఈ రోజు జరిగింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో... కేంద్ర పౌర విమానయాన, సహకార శాఖ సహాయ మంత్రి శ్రీ మురళీధర్ మోహోల్ పాల్గొన్నారు.

పార్లమెంటు సభ్యులు శ్రీ గోపాల్ జీ ఠాకూర్ (దర్భంగా, బీహార్)... శ్రీ అనూప్ సంజయ్ ధోత్రే (అకోలా, మహారాష్ట్ర)... శ్రీమతి సయానీ ఘోష్ (జాదవ్‌పూర్, పశ్చిమ బెంగాల్)... శ్రీ కామాఖ్య ప్రసాద్ తాసా (కాజిరంగా, అస్సాం)... డాక్టర్ ఎం. ధనపాల్ (రాజ్యసభ, తమిళనాడు)... శ్రీ రామ్‌రావు సఖారం వాడ్‌కుటే (రాజ్యసభ, మహారాష్ట్ర)... మైసూర్ ఎంపీ శ్రీ యదువీర్ చామరాజ వడియార్ ఈ సమావేశానికి హాజరయ్యారు.

పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన... చర్చలను ఆయా ప్రాంతాలకు మరింత చేరువ చేసే ప్రభుత్వ విధానానికి అనుగుణంగా, ఆ శాఖకు చెందిన పార్లమెంటరీ సలహా కమిటీ 2017 తర్వాత తొలిసారిగా ఢిల్లీ వెలుపల సమావేశమైంది. మైసూరులో జరిగిన ఈ సమావేశంలో, 'ఉడాన్' పథకం తదుపరి దశ, ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ వ్యవస్థలో సంస్కరణలు, ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ పరివర్తన వంటి అంశాలపై కమిటీ చర్చించింది.

కమిటీని ఉద్దేశించి శ్రీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... భారత విమానయాన రంగ వృద్ధి ప్రధాన గమ్యస్థానాలకు మించి, విమానాశ్రయాల అభివృద్ధికి మించి విస్తరిస్తోందని అన్నారు. "ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత అయిన 'ఉడాన్' ద్వారా, విమానయాన రంగ ప్రాంతీయ అభివృద్ధికి, సమ్మిళిత ఆర్థిక వృద్ధికి చోదక శక్తిగా మారుతోంది. దీని ద్వారా రైతులు, ఎగుమతిదారులు, వ్యాపారులు, సమాజాలూ లబ్ధి పొందుతున్నాయి. ఎమ్ఆర్‌వో, ఎయిర్ కార్గో వంటి రంగాల్లో సంస్కరణలను ముందుకు తీసుకువెళ్తూ... డ్రోన్లు, ఈవీటీవోఎల్‌ల ద్వారా భారత విమానయాన ఆవిష్కరణల తదుపరి దశకు ఇది నాయకత్వం వహిస్తోంది'' అని ఆయన పేర్కొన్నారు. ఉడాన్ పథకం ద్వారా వచ్చిన మార్పులను వివరిస్తూ "గత పదేళ్లలో, మేం విమానాశ్రయాల అభివృద్ధికి, విమానయాన సంస్థల కు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కోసం సుమారు రూ. 10,000 కోట్లు పెట్టుబడి పెట్టాం. ఇప్పుడు ఉడాన్ తదుపరి దశ కింద అపూర్వమైన రీతిలో రూ. 28,840 కోట్లు కేటాయించడం ద్వారా ఈ లక్ష్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నాం'' అని కేంద్ర మంత్రి తెలిపారు. భద్రత, శిక్షణలో ఉన్నత ప్రమాణాలను పాటిస్తూనే, శిక్షణ పొందిన పైలట్ల లభ్యతను పెంచడానికి ఎఫ్‌టీవో వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలనూ ఆయన కమిటీకి వివరించారు. ఎఫ్‌టీవో వ్యవస్థ 2020లో ఉన్న 32 ఎఫ్‌టీవోల నుంచి 2026 నాటికి 41కి విస్తరించింది. ఫ్లయింగ్ బేస్‌ల సంఖ్య 32 నుంచి 63కి పెరిగింది. కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు ఆదేశాల మేరకు ప్రారంభించిన ఎఫ్‌టీవో ర్యాంకింగ్ విధానం... ఎఫ్‌టీవోల పనితీరులో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని కల్పించింది. దీని ద్వారా యువత తమ పైలట్ కెరీర్ ప్రారంభ దశలోనే సరైన అవగాహనతో నిర్ణయం తీసుకునే అవకాశం ఏర్పడింది. విమానయాన రంగంలోని అవకాశాలను ప్రస్తావిస్తూ "ప్రపంచంలోనే ఎక్కడా లేనంత భారీ స్థాయిలో భారతీయ విమానయాన సంస్థలు విమానాల కోసం ఆర్డర్లు ఇచ్చాయి. విమానాల ఆర్డర్లు ఒక అంశం మాత్రమే. వాటిని నడపడానికి నైపుణ్యం, భద్రత పట్ల అవగాహన కలిగిన సిబ్బంది ఎంతో అవసరం. భారత విమానయాన రంగ వృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన సిబ్బందిని మనం విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలని అనుకోవడం లేదు. దాని కోసం అవసరమైన సిబ్బందికి ఇక్కడే, మన దేశంలోనే శిక్షణనివ్వాలని మేం కోరుకుంటున్నాం'' అని కేంద్ర మంత్రి వెల్లడించారు.

విమానాల వినియోగంలో గణనీయ వృద్ధితో... అంటే ఒక్కో విమానం నగటున ఏడాదికి 1,765 గంటల పాటు ఎగరడం ద్వారా (ఇది సుమారు 1,500 గంటల ప్రపంచ స్థాయి ప్రమాణం కంటే ఎక్కువ) 'ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ'లో వచ్చిన మార్పుల గురించి కమిటీ చర్చించింది. రెండు దశాబ్దాలకు పైగా వరుసగా లోటును ఎదుర్కొన్న తర్వాత, ఈ సంస్థ తొలిసారిగా మిగులు బడ్జెట్టును సాధించింది.

పౌర విమానయాన శాఖ కార్యదర్శి శ్రీ సమీర్ కుమార్ సిన్హా, డీజీసీఏ డైరెక్టర్ జనరల్ శ్రీ ఫైజ్ అహ్మద్ కిద్వాయ్... ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీ విపిన్ కుమార్, బీసీఏఎస్ డైరెక్టర్ జనరల్ శ్రీ రాజేష్ నిర్వాన్, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరైన ఎంపీలకు వివరాలను అందించారు. విలువైన సూచనలను అందించినందుకు సభ్యులను కేంద్ర మంత్రి అభినందించారు. పౌర విమానయాన రంగాన్ని నిరంతరం వృద్ధి చేసే, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే చర్యలను చేపట్టేటప్పుడు ఈ సూచనలను తప్పక పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

# మహాలక్ష్మి ఆలయంలో కుంకుమార్చనలు

## –వేలాదిగా పాల్గొన్న మహిళా భక్తులు



కరీంనగర్, ఆగష్టు 22: శ్రావణ మాసంలో అత్యంత పవిత్రంగా భావించే వరలక్ష్మి వ్రతం సందర్భంగా కరీంనగర్ నగరంలోని మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో వేలాది మంది మహిళా భక్తులు పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి..

## –ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

ఖమ్మం, ఆగష్టు 22:విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



ఇస్తున్నామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. ములకలపల్లిలోని స్థానిక పాఠశాలలో విద్యార్థుల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఎమ్మెల్యే చొరవతో ఏర్పాటు చేసిన నూతన బోరుబావిని ఆయన ప్రారంభించారు.

అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు అందుతున్న ఆహారం నాణ్యతను పరిశీలించడంతో పాటు వారి చదువు తీరును, పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు.

పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించినందుకు ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వగ్గెల రాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింత బుచ్చిరాములు, వార్డెన్ నాగప్రత్యూష, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోటీని దెబ్బతీసే చర్యలకు పాల్పడినందుకుగాను ఆర్థిక, ఆర్థికేతర ఆంక్షలను విధించిన సీసీఐ

న్యూఢిల్లీ, ఆగష్టు 22:సిండికేట్ గా ఏర్పడి పోటీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఆగ్రో ఇన్‌పుట్ డీలర్స్ అసోసియేషన్ (ఏఐడీఏ), ఆగ్రో ఇన్‌పుట్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏఐడబ్ల్యూఏ) పైనా, మన్మోహన్ సి. కలంత్రి, అరవింద్‌భాయ్ జెరంభాయ్ పటేల్ పైనా పోటీ చట్టం – 2002లోని సెక్షన్ 27 కింద భారత పోటీ (కాంపిటీషన్) కమిషన్ (సీసీఐ) ఆర్థిక, ఆర్థికేతర ఆంక్షలు విధించింది.

ఈ వ్యవహారంలో ఏఐడీఏ, ఏఐడబ్ల్యూఏ, కలంత్రి, పటేల్‌లు పోటీ చట్టంలోని సెక్షన్ 3(1)తో కలిసి ఉన్న సెక్షన్ 3(3)(బి) నిబంధనలను ఉల్లంఘించినట్లు కమిషన్ నిర్ధారించింది. ఈ మేరకు, చట్టంలోని సెక్షన్ 27(ఏ) ప్రకారం చట్ట నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలినందున సంస్థలు, వారి ప్రతినిధులు ఏఐడీఏ ప్రధాన కార్యదర్శి శ్రీ ప్రవీణ్ భాయ్ పటేల్, ఏఐడీఏ జాతీయ ప్రతినిధి శ్రీ సంజయ్ కుమార్ రఘువంశీలను భవిష్యత్తులో ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని కమిషన్ ఆదేశించింది. చట్టంలోని సెక్షన్ 48 నిబంధనల కింద వీరిని బాధ్యులుగా నిర్ధారించింది.

ఉల్లంఘన స్వభావం, తీవ్రతను, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకున్న కమిషన్ ఏఐడీఏపై రూ. 81,889, ఏఐడబ్ల్యూఏపై రూ. 3,92,269, కలంత్రికి రూ. 4,98,903, అరవింద్ భాయ్ జేరాంభాయ్ పటేల్‌కి రూ. 74,717, ప్రవీణ్ భాయ్ పటేల్‌కి రూ. 9,177, రఘువంశీకి రూ. 8,622 చొప్పున జరిమానాలు విధించింది.

# నిజామాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన మంత్రి..

## –లబ్ధిదారులతో మాట్లాడి ఆనందం పంచుకున్న వైనం

## హైదరాబాద్ తరహాలో ఇందిరమ్మ ఇళ్ల టవర్లు.. నిజామాబాద్ నుంచే శ్రీకారం

## రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లకు అనుమతులు.. 2 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి



నిజామాబాద్, ఆగష్టు 22: పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహించిన ఆయన.. నగర కార్పొరేషన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న, ఇప్పటికే పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన వెంట ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడిన మంత్రి.. వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సొంతింటి కల నెరవేరిందన్న ఆనందం లబ్ధిదారుల ముఖాల్లో కనిపించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా నిలుస్తాయని మంత్రి తెలిపారు. ఇల్లు లేని నిరుపేద కుటుంబాలందరికీ సొంత గూడు కల్పించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. లబ్ధిదారులను కలిసిన ప్రతిసారీ పేద కుటుంబాల చిరకాల ఆకాంక్షను తీర్చే అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కానుకలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

**నిజామాబాద్ నుంచి ఇందిరమ్మ ఇళ్ల టవర్లకు శ్రీకారం**

హైదరాబాద్ తరహాలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్ల టవర్లను రాష్ట్రంలోని ఇతర పట్టణాల్లోనూ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి వెల్లడించారు.

ఇందులో భాగంగా నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో హౌసింగ్ శాఖకు సంబంధించిన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు.

నిజామాబాద్ నుంచే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే రెండు విడతలుగా, హైదరాబాద్‌లో మొదటి విడత ఇళ్లతో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లను మంజూరు చేశామని మంత్రి పేర్కొన్నారు.

ఇప్పటి వరకు 2 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తై గృహప్రవేశాలు కూడా జరిగాయని తెలిపారు.

**అసంపూర్తి డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై దృష్టి**

అనంతరం నిజామాబాద్ నగరంలో గత ప్రభుత్వాల హయాంలో ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయాన్ని మంత్రి పరిశీలించారు.

వాటిని నివాసయోగ్యంగా మార్చేందుకు అవసరమైన నిర్మాణాలు, మౌలిక వసతుల పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ఆ ఇళ్లను కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు సూచించారు. పేదలకు సొంత ఇంటి భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తుందని మంత్రి తెలిపారు.

# టెలికమ్యూనికేషన్లు, ఐసీటీ రంగాల్లో ద్వైపాక్షిక సహకార బలోపేతం లక్ష్యంగా భారత్–బ్రెజిల్ మధ్య అవగాహన ఒప్పందం

న్యూఢిల్లీ, ఆగష్టు 22:పూణేలో జరిగిన బ్రిక్స్ ఐసీటీ ట్రాక్ సమావేశం సందర్భంగా... టెలికమ్యూనికేషన్లు, సమాచార- కమ్యూనికేషన్ సాంకేతికతల (ఐసీటీ) రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడం లక్ష్యంగా భారత్, బ్రెజిల్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా ఆయా రంగాల్లో పరస్పర సహకారం పట్ల తమ నిబద్ధతను ఇరు దేశాలూ పునరుద్ఘాటించాయి.

ఇరు దేశాల కమ్యూనికేషన్ శాఖల మంత్రులు శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా, శ్రీ ఫ్రెడెరికో డి సిక్వేరా ఫిల్హో ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.

డిజిటల్ ఆవిష్కరణలను అభివృద్ధి చేయడం, డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, సాంకేతిక సహకారాన్ని ప్రోత్సహించడం... ముఖ్యంగా టెలికమ్యూనికేషన్లు, ఐసీటీ వంటి వ్యూహాత్మక, అభివృద్ధి చెందుతున్న రంగాల్లో భారత్–బ్రెజిల్ భాగస్వామ్య నిబద్ధతను ఈ ద్వైపాక్షిక సహకారం స్పష్టం చేస్తుంది.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా మాట్లాడుతూ "ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేయడం భారత్–బ్రెజిల్ సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుంది. సార్వత్రిక అనుసంధానం, సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, సామర్థ్యాలను పెంపొందించడం, ఉత్తమ పద్ధతులను పంచుకోవడం వంటి రంగాల్లో గొప్ప సహకారానికి ఇది మార్గం సుగమం చేస్తుందని నేను కచ్చితంగా నమ్ముతున్నా" అని అన్నారు.

సమగ్ర ఐసీటీ సహకారం కోసం విధాన ప్రణాళిక

ఈ అవగాహన ఒప్పందం టెలికమ్యూనికేషన్లు, ఐసీటీ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడానికి విధాన ప్రణాళికను రూపొందిస్తుంది. సమానత్వం, పరస్పర ప్రయోజనం, పరస్పర గౌరవం అనే సూత్రాల ఆధారంగా పరస్పర ప్రయోజనకరమైన అవకాశాలను అన్వేషిస్తూ... సమాచారం, అనుభవాలు, ఉత్తమ పద్ధతులను నిరంతరం పంచుకునేలా ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తుంది.

సహకారం, టెలికమ్యూనికేషన్ల విధానాలు, నిబంధనలు, కృత్రిమ మేధ, 5జీ–6జీ, ఓపెన్ ఆర్ఏఎన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డైరెక్ట్–టు–డివైస్ కనెక్టివిటీ, లో ఎర్త్ ఆర్బిట్ ఉపగ్రహాలు, నాన్- టెరిస్ట్రియల్ నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రమ్, ఉపగ్రహ/ కక్ష్య నిర్వహణ, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఆప్టికల్ ఫైబర్, సబ్ మెరైన్ కేబుళ్ల వంటి అనేక రకాల వ్యూహాత్మక, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు ఈ అవగాహన ఒప్పందం కిందికి వస్తాయి.

సైబర్ సెక్యూరిటీ, సార్వత్రిక–అర్థవంతమైన అనుసంధానం, డిజిటల్ సమ్మిళితం, వినియోగదారుల రక్షణ, ప్రైవేట్ నెట్‌వర్క్‌లు, డిజిటల్ పరివర్తన, ఐసీటీల పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడం వంటి కీలక రంగాలను ఈ విధాన ప్రణాళిక కవర్ చేస్తుంది.

టెలి కమ్యూనికేషన్లు, ఐసీటీ రంగాల్లో భారత్- బ్రెజిల్ సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ ఒప్పందం కీలకమైన ముందడుగు అవుతుంది. ఇది వర్ధమాన సాంకేతికతలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, సైబర్ సెక్యూరిటీ, కనెక్టివిటీ, సామర్థ్యాలను పెంపొందించడం, అంతర్జాతీయ సహకారం వంటి రంగాల్లో సమన్వయం కోసం ఒక సమగ్రమైన, దూరదృష్టితో కూడిన విధాన ప్రణాళికను అందిస్తుంది.

# నేడు విశాఖపట్నంలో బ్రిక్స్ యువజన వ్యవహారాలు - క్రీడా మంత్రుల సమావేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 22:బ్రిక్స్–2026 అధ్యక్ష స్థానంలో ఉన్న భారత్... 2026 ఆగస్టు 22న బ్రిక్స్ యువజన వ్యవహారాల మంత్రుల సమావేశం, 2026 ఆగస్టు 23న బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశాలకు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఆతిథ్యమివ్వబోతోంది. యువజన వ్యవహారాలు, క్రీడల్లో సహకారాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా.. 11 బ్రిక్స్ సభ్యదేశాలకు చెందిన మంత్రులు, వివిధ ప్రతినిధి బృందాల అధిపతులు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు.

ప్రజలే కేంద్రంగా, మానవతే ప్రాతిపదికగా.. 'పటిష్ఠ, వినూత్న సహకారం – సుస్థిరతల సాధన' ఇతివృత్తం మార్గదర్శక సూత్రంగా 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వహిస్తోంది.

బ్రిక్స్‌కు భారత్ అధ్యక్షత వహిస్తున్న సమయంలో జరిగిన సమావేశాలు, చర్చలు పునాదిగా ఈ మంత్రివర్గ స్థాయి భేటీలు కొనసాగుతాయి. బ్రిక్స్ సభ్య దేశాల మధ్య సహకారాన్ని ముందుకు తీసుకెళ్లే వేదికలుగా ఈ సమావేశాలు నిలుస్తాయి.

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఈ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు. యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి శ్రీమతి రక్షా ఖడ్సే ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

యువజన వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీ సునీల్ పాలివాల్, క్రీడా శాఖ కార్యదర్శి శ్రీ హరిరంజన్ రావుతోపాటు యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు కూడా ఈ మంత్రుల స్థాయి సమావేశంలో పాల్గొంటారు.

షెడ్యూలు ప్రకారం.. యువజన వ్యవహారాల మంత్రుల సమావేశంలో డాక్టర్ మాండవీయ దేశం తరఫున ప్రకటన చేస్తారు. శ్రీమతి రక్షా ఖడ్సే ముగింపు ప్రసంగం చేస్తారు.

ఆగస్టు 22న జరిగే బ్రిక్స్ యువజన మంత్రుల సమావేశంలో విద్య, నైపుణ్యాలు, వ్యవస్థాపకత, సంక్షేమం, సుస్థిరాభివృద్ధి వంటి అంశాలపై చర్చిస్తారు. వాటితోపాటు యువత అభివృద్ధి, సాధికారత అంశాల్లో సహకారాన్ని బలోపేతం చేయడంపై ఈ సమావేశం ప్రధానంగా దృష్టి సారిస్తుంది.

బ్రిక్స్ యూత్ కౌన్సిల్ సమావేశం, బ్రిక్స్ యువజన సదస్సుల నుంచి వచ్చిన కీలక సిఫార్సులను ఈ సమావేశంలో పరిశీలిస్తారు. అలాగే భవిష్యత్ బ్రిక్స్ అధ్యక్ష దేశాల ఆధ్వర్యంలో.. సభ్య దేశాలు పరస్పరం సహకరించుకోవాల్సిన రంగాలను కూడా ఈ భేటీలో గుర్తిస్తారు.

బ్రిక్స్ యువజన శాఖ మంత్రుల ఉమ్మడి ప్రకటననూ, బ్రిక్స్ యువజన సహకార కార్యాచరణ విధానాన్నీ ఈ సమావేశం ముగింపు సందర్భంగా ఆమోదిస్తారు.

క్రీడా రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఉమ్మడిగా కట్టుబడి ఉన్నామని స్పష్టం చేస్తూ... ఆగస్టు 23న జరగనున్న బ్రిక్స్ క్రీడా శాఖా మంత్రుల సమావేశంలో 11 బ్రిక్స్ సభ్య దేశాల క్రీడా మంత్రులు, ప్రతినిధి బృందాల అధిపతులు పాల్గొంటారు.

సంప్రదాయ, దేశీయ క్రీడలు, క్రీడా సాంకేతికత, క్రీడా పరికరాల తయారీతోపాటు ఉమ్మడి ప్రకటన ఆమోదానికి సంబంధించిన అంశాలపై.. భారత్ అధ్యక్షతన బ్రిక్స్ క్రీడా విభాగం ప్రధానంగా దృష్టి సారించింది.

బ్రిక్స్ మైత్రీ సైక్లింగ్‌పాటు 11 బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధుల అధికారిక ప్రసంగాలు, ద్వైపాక్షిక సమావేశాలు, సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఈ కార్యక్రమంలో ఉంటాయి.

క్రీడా మంత్రుల సమావేశంలో.. బ్రెజిల్, చైనా, ఈజిప్టు, ఇథియోపియా, భారత్, ఇండోనేషియా, ఇరాన్, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రతినిధి బృందాల అధిపతులు అధికారిక ప్రసంగాలు చేస్తారు. అనంతరం ఉమ్మడి ప్రకటనను ఆమోదిస్తారు.

బ్రిక్స్–2026కు భారత్ అధ్యక్షత వహిస్తున్న వేళ.. సభ్య దేశాల మధ్య వ్యవస్థాగత సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికీ, అనుభవాలనూ ఉత్తమ విధానాలనూ పరస్పరం పంచుకోవడానికీ ఈ రెండు మంత్రుల స్థాయి సమావేశాలు కీలక వేదికలుగా నిలవనున్నాయి. అంతేకాకుండా యువజన వికాసం, క్రీడా రంగాల్లో ఉమ్మడి ప్రాధాన్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు దోహదపడతాయి.

# పోతిరెడ్డిపాడుతో ఆంధ్ర సర్కార్ నీళ్ల దోపిడీ

**-ఆంధ్ర నీటి దోపిడిని అడ్డుకుంటాం.**
**-ప్రభుత్వ చేతగానితనం వల్లే తెలంగాణకు అన్యాయం.**
**-సాగర్ ఆయకట్టుకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలి.**
**-మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి**




నల్గొండ, ఆగష్టు 22: పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ సర్కార్ నీటి దోపిడి చేస్తుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోతిరెడ్డిపాడు నుండి ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా తెలంగాణను ఎడారిగా మారుస్తుందని ఆరోపించారు. నాగార్జునసాగర్ ఓవర్‌ఫ్లో అవుతున్న సమయంలోనే పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా నీటిని తరలించుకోవాలని స్పష్టంగా ఆదేశాలు ఉన్నా విస్మరించి ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా నీటిని రాయలసీమకు తరలించుకుపోతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 30 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఈ నీటితో సాగర్ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయొచ్చని ఆయన సూచించారు. బీఆర్ఎస్ హయాంలో 17 సార్లు సాగర్ నీటిని ఆయకట్టుకు విడుదల చేశామని జగదీష్ రెడ్డి గుర్తు చేశారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు దద్దమ్మ మంత్రుల చేతగానితనం వల్ల సాగర్ ఆయకట్టు రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. మంత్రుల అసమర్థత వల్ల వ్యవసాయం ఆగమైందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ఏ వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరని ఆయన వ్యాఖ్యానించారు. రైతులకు సాగునీరు ఇవ్వడం లేదు, హాస్టల్ పిల్లలకు సరైన భోజనం పెట్టడం లేదు, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు, ఏదైనా ఉద్యోగులకు సకాలంలో బకాయిలను చెల్లించడం లేదు.. ఇలా అందరినీ ఇబ్బందులకు గురి చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న కరువు ఎలినినో ప్రభావంతో వచ్చింది కాదని, కాంగ్రెస్ అసమర్థ పాలన ద్వారా వచ్చిన కరువు అని ఆయన వ్యాఖ్యానించారు. నాగార్జునసాగర్ ఆయకట్టుకు వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అసమర్థత వల్లే సాగర్ నీటిని విడుదల చేయకుండా ఆయకట్టు రైతాంగాన్ని ఎండబెడుతున్నారని విమర్శించారు. తమకు జరుగుతున్న అన్యాయంపై రైతులు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. కేసీఆర్ పాలనలో సాగర్‌లో డెడ్ స్టోరేజ్‌లో నీళ్లు ఉన్నప్పుడు కూడా ఆయకట్టుకు నీటిని విడుదల చేశారని, ఇప్పుడు సాగర్‌లో 532 అడుగుల నీటి నిల్వ ఉందని ఆయన చెప్పారు. నాగార్జునసాగర్ ఆయకట్టుకు ఈ నీటితో సాగునీటిని అందించవచ్చని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలను గెలిపించామని ఆయకట్టు రైతులు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారని ఆయన అన్నారు. ఏపీ ప్రభుత్వం కృష్ణా నీటి అక్రమ తరలింపుపై కేసీఆర్‌తో చర్చించి త్వరలో భారీ ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని జగదీష్ రెడ్డి చెప్పారు. ఈ మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, భాస్కరరావు, మాజీ జడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, ఒంటెద్దు నరసింహారెడ్డి, నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పునరుద్ధరించిన ఖేలో ఇండియా పథకానికి మద్దతు తెలిపిన ఒలింపియన్ జ్వాలా గుత్తా




న్యూఢిల్లీ, ఆగష్టు 22:పునరుద్ధరించిన ఖేలో ఇండియా పథకం భారత క్రీడారంగం రూపురేఖలను మార్చే సామర్థ్యం కలిగి ఉందని రెండుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న (2012 లండన్, 2016 రియో) క్రీడాకారిణి, ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పతక విజేత జ్వాలా గుత్తా అన్నారు. హైదరాబాద్ లో ఈ రోజు మీడియాతో మాట్లాడుతూ, ఈ పథకం క్రీడారంగంలో పెనుమార్పు తీసుకొచ్చే గేమ్ చేంజర్‌గా నిలుస్తుందని, చాలా కాలం క్రితమే ఈ పథకం రావాల్సిందని ఆమె పేర్కొన్నారు.

జ్వాలా గుత్తాతో పాటు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్‌ఏటీఎస్) వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనిబాలా దేవి, బెంగళూరులోని భారత క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఏఐ) ప్రాంతీయ డైరెక్టర్ శ్రీ విష్ణు సుధాకరన్, ఢిల్లీలోని ఎస్ఏఐ డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి ఎస్. హిమబిందు కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

పెద్ద సంఖ్యలో మీడియా ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో శ్రీమతి హిమబిందు మాట్లాడుతూ, ఖేలో ఇండియా పథకంలోని కీలక అంశాలను, తెలంగాణ వంటి రాష్ట్రంపై ఈ పథకం చూపించే ప్రభావాన్ని వివరించారు. 2026-31 కాలానికి అమలయ్యే ఈ పథకానికి గత కేటాయింపుతో పోలిస్తే 8 రెట్లు పెంచి రూ.29,054 కోట్లను కేటాయించారు. ఈ పథకం ద్వారా మద్దతు పొందే క్రీడాకారుల సంఖ్యను 10 రెట్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

"ఈ పథకం కింద క్రీడల్లో అట్టడుగు స్థాయి నుంచి ఒలింపిక్ స్థాయి ప్రతిభకు చేరుకునేలా సమగ్ర ప్రణాళిక రూపొందించారు. వ్యవస్థలోని లోటుపాట్లను ఈ పథకం పరిష్కరిస్తుంది. కోచ్‌లతో బోర్డును ఏర్పాటు ద్వారా చిన్నారుల క్రీడా ప్రతిభను మరింత మెరుగుపరచేందుకు అవకాశం ఉంటుంది. అకాడమీల వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, మౌలిక సదుపాయాలు, క్రీడా సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు తగినన్ని నిధులు అందుబాటులో ఉన్నాయి" అని శ్రీమతి హిమబిందు తెలిపారు.

తెలంగాణలో క్రీడల అభివృద్ధికి కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ ఇప్పటికే అధిక ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్రంలో మొత్తం 33 ఖేలో ఇండియా కేంద్రాలను మంజూరు చేశారు. వీటిలో మాజీ ఛాంపియన్ క్రీడాకారులు 601 మందికి పైగా క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్నారు. మేడ్చల్ - మల్కాజ్‌గిరిలో ఖేలో ఇండియా స్టేట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇందులో రోయింగ్, వెయిట్‌లిఫ్టింగ్, ఫెన్సింగ్ తదితర క్రీడాంశాల్లో మొత్తం 254 మంది క్రీడాకారులకు శిక్షణ, ప్రోత్సాహం అందుతోంది. వీరిలో 152 మంది పురుషులు, 102 మంది మహిళా క్రీడాకారులు ఉన్నారు.

రాష్ట్రంలో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, సైక్లింగ్, టెన్నిస్, ఫుట్‌బాల్ తదితర క్రీడాంశాల్లో మొత్తం 19 ఖేలో ఇండియా గుర్తింపు పొందిన అకాడమీలను ఏర్పాటు చేసేందుకు నోటిఫై చేశారు. మహిళల కోసం క్రీడల (స్పోర్ట్స్ ఫర్ ఉమెన్) విభాగం కింద తెలంగాణలో 127 అస్మిత లీగ్‌లు నిర్వహించగా, వీటిలో 20,921 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు.

గుత్తా ఇలా అన్నారు: "నేనూ ప్రభుత్వ అండతోనే ఎదిగాను. ప్రభుత్వ మద్దతు లేకుండా ఒక క్రీడాకారిణిగా నేను సాధించినదంతా సాధ్యమయ్యేది కాదు. కొత్త రూపంలోని ఈ ఖేలో ఇండియా పథకం చాలా ఆశాజనకంగా కనిపిస్తోంది. క్షేత్ర స్థాయి నుంచి అభివృద్ధి, సుస్థిరతపై దృష్టి సారించడంతో, పిల్లలను క్రీడలకు పంపడాన్ని తల్లిదండ్రులు చాలా సురక్షితంగా భావిస్తారు. క్రీడలను ప్రోత్సహించడంపై ప్రభుత్వం ఎల్లప్పుడూ శ్రద్ధ వహిస్తూనే ఉంది. ఇది ఈ రంగంపై గణనీయ ప్రభావం చూపుతుంది. దీని ప్రభావం కూడా అపారంగా ఉంటుంది. ఈ పథకంతో అనుబంధం ఉన్నందుకు నేను సంతోషంగా ఉన్నాను" అని అన్నారు.

'ఖేలో ఇండియా ఉత్కృష్ట విద్యాలయాలు', 'ఫీడర్ పాఠశాలలు', 'ఖేలో ఇండియా కేంద్రాల' ద్వారా ఒక ప్రామాణికమైన, శాస్త్రీయమైన, సాంకేతికతతో కూడిన ప్రతిభా గుర్తింపు వ్యవస్థను ఏర్పాటు చేయడం కేఐఎస్ ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. ఈ విధానం 'ఖేలో ఇండియా అథ్లెట్లు', 'వర్ధమాన ఖేలో ఇండియా అథ్లెట్లు' (ఇ-కేఐఏ) అనే విభాగాలను పరిగణనలోకి తీసుకుంటుంది.

కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ, రాష్ట్రాలకు మధ్య సంబంధాన్ని బలోపేతం చేయడంపై కేఐఎస్ ప్రధానంగా దృష్టి సారిస్తోంది. ఈ దార్శనికతలో భాగంగా ఈ ఏడాది చివర్లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను తెలంగాణ నిర్వహించనుంది. ఖేలో ఇండియా స్కీమ్‌లో ప్రతిభను మెరుగుపరచడం, అథ్లెట్ల నిలుపుదల, అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయికి పరివర్తన, సంస్కరణ-ఆధారిత విజయాల ఆధారంగా నిధులు అందించే నిబంధనతో... కేంద్ర-రాష్ట్రాల సహకార నమూనా సదుపాయం అందుబాటులో ఉంది.

"తెలంగాణ వంటి రాష్ట్రానికి ఇది ఎంతో ప్రయోజనకరం. ఈ పథకం దీర్ఘకాలిక ప్రణాళికా రచనకు తోడ్పడుతుంది. క్రీడలను ఒక అంశంగా పరిగణించే రాష్ట్రాల విధానంపై ఈ దార్శనికత గణనీయ ప్రభావం చూపుతుంది. క్రీడలను విద్యా విధానంతో అనుసంధానిస్తున్న క్రమంలో, మనం మరింత మెరుగైన ఫలితాలను ఆశించవచ్చు" అని డాక్టర్ సోనిబాలా దేవి అన్నారు.

ఖేలో ఇండియా పథకాన్ని ఇంకా మెరుగుపరుస్తున్నట్లు శ్రీ సుధాకరన్ అన్నారు. "ఈ పథకం ఎలా పనిచేస్తుంది, రాష్ట్రాలు దీనిలోని కీలక అంశాలను ఎలా స్వీకరిస్తాయి అనే విషయాలను కార్యాచరణ మార్గదర్శకాలు వివరిస్తాయి. గతంలో మేం పరిమిత బడ్జెట్లతో 'కేంద్రీకృత' విధానాన్ని అనుసరించేవాళ్లం. ఈ ఖేలో ఇండియా పథకం, భాగస్వాములందరితో జరిపిన విస్తృత చర్చల ఫలితమే. ఇది అందరికీ ప్రయోజనకరం. క్రీడా ఉద్యమాన్ని, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న 'ఖేలో భారత్ నీతి'ని ప్రోత్సహించే విధంగా బడ్జెట్ కేటాయించారు" అని ఆయన అన్నారు.

# భారత్ ప్రపంచవ్యాప్త విస్తరణను వివరించిన డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 22: బ్రిక్స్ శాస్త్ర, సాంకేతికత, ఆవిష్కరణల మంత్రివర్గ 14వ సమావేశం ఘనంగా ప్రారంభమైంది. కేంద్ర శాస్త్ర-సాంకేతిక శాఖ, భౌగోళిక విజ్ఞాన శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), పీఎంవో- అణు ఇంధన - అంతరిక్ష విభాగం - సిబ్బంది, ప్రజా వ్యవహారాలు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ ప్రారంభోపన్యాసం చేశారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో శాస్త్ర, సాంకేతికత, ఆవిష్కరణ రంగాల్లో భారత్‌కు పెరుగుతున్న అంతర్జాతీయ ప్రాధాన్యతను ఆయన వివరించారు.

బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులకు స్వాగతం పలికిన డాక్టర్ జితేంద్ర సింగ్.. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతల కోసం భారత్ "స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" ఇతివృత్తాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. శాస్త్ర, సాంకేతిక, ఆవిష్కరణలు మానవాళికి ఉపయోగపడేలా ఉండాలని, విపత్తులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచాలని, సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించాలని, సుస్థిర అభివృద్ధికి దోహదపడాలని, దేశాల మధ్య సమాన భాగస్వామ్యాలను బలోపేతం చేయాలని ఈ ఇతివృత్తం ప్రతిబింబిస్తుందని చెప్పారు.

కృత్రిమ మేధ,, క్వాంటం సాంకేతికతలు,, అధునాతన పదార్థాలు, బయోటెక్నాలజీ, ఫోటోనిక్స్, భౌగోళిక సమాచార సాంకేతికతలు, హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలతో ప్రపంచం వేగంగా మారుతోందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈ సాంకేతికతలు అపూర్వమైన అభివృద్ధి అవకాశాలను సృష్టిస్తున్నప్పటికీ, ఆవిష్కరణలు అందరికీ అందుబాటులో ఉండేలా, అందరూ భరించగలిగేలా, విశ్వసనీయంగా, సుస్థిరంగా ఉండేలా చూడటానికి మరింత బలమైన అంతర్జాతీయ సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు.

బ్రిక్స్‌లో విస్తారమైన జనాభా, శాస్త్రీయ ప్రతిభ, పెరుగుతున్న పరిశోధనా సామర్థ్యాలు ఉన్నందున సహకారపూర్వక, బాధ్యతాయుతమైన, భవిష్యత్తు అవసరాలకు అనుగుణమైన ఆవిష్కరణల వ్యవస్థను అభివృద్ధి చేయడానికి బ్రిక్స్‌కు మంచి అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. సంభాషణను కొనసాగించడంలో, వాటిని ఆచరణాత్మక సహకారం, స్పష్టమైన ఫలితాలుగా మార్చడంలో ఎస్‌టీఐ స్టీరింగ్ కమిటీ, సీనియర్ అధికారులు, వివిధ ఎస్‌టీఐ వర్కింగ్ గ్రూపులు అందిస్తున్న సహకారాన్ని కేంద్రమంత్రి శ్రీ జితేంద్ర సింగ్ ప్రశంసించారు.

పరిశోధన సహకారం, ఆవిష్కరణ భాగస్వామ్యాలు, యువ శాస్త్రవేత్తల మార్పిడి కార్యక్రమాలు, పరిశోధనా మౌలిక వసతులు, అంశాలవారీ వర్కింగ్ గ్రూపులతో కూడిన బలమైన వేదికగా బ్రిక్స్ ఎస్‌టీఐ సహకారం రూపుదిద్దుకుందని మంత్రి తెలిపారు. భారత అధ్యక్షతలో, అభివృద్ధి చెందుతున్న శాస్త్రీయ, సాంకేతిక రంగాలతో పాటు సమాజాల అభివృద్ధి ఆకాంక్షలకు అనుగుణంగా సహకారాన్ని తీర్చిదిద్దేందుకు బ్రిక్స్ ఎస్‌టీఐ ప్రాధాన్యతలపై సమగ్ర సమీక్ష జరుగుతోందని పేర్కొన్నారు.

శాస్త్ర, ఆవిష్కరణల విషయంలో బహిరంగ, సమ్మిళిత, మానవ కేంద్రీకృత విధానాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ కట్టుబడి ఉందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. జాతీయ క్వాంటం మిషన్, జాతీయ సూపర్ కంప్యూటింగ్ మిషన్, బయోఈ3 విధానం, జాతీయ జియోస్పేషియల్ విధానం, విస్తరిస్తున్న డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల వ్యవస్థ వంటి దేశ కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. ఆవిష్కరణలు చివరికి ప్రజల జీవనాన్ని మెరుగుపరచడం, సామాజిక స్థిరత్వాన్ని బలోపేతం చేయడం, సుస్థిర ఆర్థిక పరివర్తనకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా ఉండాలన్న విధానాన్ని ఇవి ప్రతిబింబిస్తున్నాయని చెప్పారు.

అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణలకు ఆర్థిక సహాయం, ప్రతిభావంతుల రాకపోకలు, పరిశోధనా మౌలిక వసతుల భాగస్వామ్యం, అంకుర సంస్థల భాగస్వామ్యాలు, సామర్థ్య నిర్మాణం వంటి అంశాల్లో మరింత లోతైన సహకారం కోసం ప్రతిష్ఠాత్మకమైనప్పటికీ ఆచరణాత్మక మార్గాలను గుర్తించాలని బ్రిక్స్ భాగస్వామ్య దేశాలకు కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. ఇటువంటి సహకారం ద్వారా ప్రపంచ సవాళ్లకు స్పందించే, అభివృద్ధి చెందుతున్న దేశాల ఆకాంక్షలకు మద్దతు ఇచ్చే భవిష్యదకదే అవసరాలకు సిద్ధమైన బ్రిక్స్ ఎస్‌టీఐ వ్యవస్థను రూపొందించవచ్చని అన్నారు.

చెన్నైలో జరుగుతున్న చర్చలు బ్రిక్స్ భాగస్వామ్య స్ఫూర్తిని మరింత బలోపేతం చేసి, మరింత ఆవిష్కరణాత్మక, స్థిరమైన, సుస్థిర ప్రపంచ నిర్మాణానికి అర్థవంతమైన సహకారం అందిస్తాయని డాక్టర్ జితేంద్ర సింగ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# హాజెలో ల్యాబరేటరీస్‌లో భారీ పేలుడు.. భారీ ప్రాణనష్టం.. !

**-రియాక్టర్ పేలడంతో పరిశ్రమలో విధ్వంసం..**
**-గతంలోనూ ఇదే పరిశ్రమలో ప్రమాదం**

నల్గొండ, ఆగష్టు 22: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ డివిజన్‌లోని భూదాన్ పోచంపల్లి మండలం అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాల సమీపంలో ఉన్న హాజెలో ల్యాబరేటరీస్ పరిశ్రమలో శుక్రవారం రాత్రి భారీ ప్రమాదం చోటుచేసుకుంది. రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో రియాక్టర్ ఒక్కసారిగా పేలడంతో పరిశ్రమలో పెద్ద ఎత్తున విధ్వంసం జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో రియాక్టర్ వద్ద రాత్రి షిఫ్ట్‌లో కార్మికులు పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో భారీ ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం. చాలా మంది గాయపడినట్లు సమాచారం. ప్రమాదం అనంతరం గాయపడిన వారిని అంబులెన్స్‌ల ద్వారా ఆసుపత్రులకు తరలిస్తున్నారు. అయితే పరిశ్రమలో మంటలు అదుపులోకి రాకపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడినట్లు సమాచారం. లోపలికి వెళ్లేందుకు ఎవరూ ధైర్యం చేయలేని పరిస్థితి నెలకొంది.

**గతంలోనూ ఇదే పరిశ్రమలో ప్రమాదం**

హాజెలో ల్యాబరేటరీస్‌లో గతంలోనూ రియాక్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. ఆ ఘటనలో పరిశ్రమ మేనేజర్ మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి అదే తరహా ప్రమాదం జరగడంతో పరిశ్రమ భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పరిశ్రమలో భద్రతా నిబంధనలు పాటించకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా ఉత్పత్తులు చేపట్టడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యాజమాన్యం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో సుమారు 20 మంది వరకు మృతి చెంది ఉండవచ్చని స్థానికులు చెబుతున్నప్పటికీ అధికారికంగా మృతుల సంఖ్య నిర్ధారణ కాలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు

## నిందితుడిని పట్టుకున్న పోలీసులు

నిజామాబాద్, ఆగష్టు 22:బోధన్ పట్టణ పోలీస్ కానిస్టేబుల్ చేతిని కొరికిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విధులకు ఆటంకం కలిగించిన నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకట్ నారాయణ తెలిపారు. శుక్రవారం రాత్రి బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ వ్యక్తి మద్యం సేవించి పేషెంట్లకు ఇబ్బంది కలిగిస్తూ వీరంగం సృష్టిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో పోలీసులు ఆసుపత్రికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కొప్పర్గకు చెందిన సదరు వ్యక్తి పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. ఓ కానిస్టేబుల్ చేతిని గట్టిగా కొరికి అక్కడి నుంచి పారిపోయేందుకు యత్నించాడు. అప్రమత్తమైన పోలీసులు అతడిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకట్ నారాయణ తెలిపారు.

# జైపూర్ డిక్లరేషన్‌ను ఆమోదించిన బ్రిక్స్ పర్యాటక మంత్రులు

న్యూఢిల్లీ, ఆగష్టు 22:భారత అధ్యక్షతన జైపూర్ లో జరిగిన బ్రిక్స్ పర్యాటక మంత్రుల సమావేశం నేడు ముగిసింది. జైపూర్ డిక్లరేషన్ (బ్రిక్స్ పర్యాటక మంత్రుల అధికారిక ప్రకటన 2026)ను సమావేశం ఆమోదించింది. బ్రిక్స్ సభ్య దేశాల మధ్య పర్యాటక రంగానికి సంబంధించిన సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి ఇది ఒక నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికను అందిస్తుంది.

కేంద్రసాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ప్రతికూలతలను తట్టుకునే సామర్థ్యం, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరతతో ముందడుగు - ఇతివృత్తంతో 2026 భారత బ్రిక్స్ అధ్యక్షత కింద బ్రిక్స్ పర్యాటక విభాగం కార్యక్రమాలు ఈ సమావేశంతో విజయవంతంగా ముగిశాయి.

ఈ సమావేశంలో బ్రిక్స్ సభ్య దేశాలకు చెందిన తొమ్మిది దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రుల స్థాయిలో బ్రెజిల్ పర్యాటక శాఖ మంత్రి గుస్తావో కోస్టా ఫెలిసియానో, ఇరాన్ సాంస్కృతిక వారసత్వం, పర్యాటకం, హస్తకళల శాఖ మంత్రి రెజా సలేహీ అమీరీ, దక్షిణాఫ్రికా పర్యాటక శాఖ మంత్రి ప్యాట్రిషియా డి లిల్లే, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ టౌక్ అల్ మారీ పాల్గొన్నారు. వీరితో పాటు చైనా, ఇథియోపియా, ఇండోనేషియా, రష్యా దేశాల ప్రతినిధి బృందాల నేతలు కూడా సమావేశానికి హాజరయ్యారు. భారత ప్రతినిధి బృందంలో పర్యాటక శాఖ కార్యదర్శి శ్రీ భువనేశ్ కుమార్, పర్యాటక శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ హరికిషోర్ ఎస్. తదితర ఉన్నతాధికారులు ఉన్నారు.

బ్రిక్స్ కు భారత్ అధ్యక్షత కింద పర్యాటక అధ్యయన బృందం చేసిన కృషికి జైపూర్ డిక్లరేషన్ ప్రతిబింబంగా నిలిచింది. ఇందులో కృత్రిమ మేధ, పర్యాటకం, సుస్థిరత, బాధ్యతాయుత పర్యాటకం, పర్యాటక రంగంలో నైపుణ్యాభివృద్ధి, సామర్థ్య పెంపు, పర్యాటక సంబంధ మార్పిడులు, ఆంక్షలు లేని ప్రయాణ సదుపాయాలు అనే అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

బ్రిక్స్ పర్యాటక శాఖ మంత్రులు ఏకాభిప్రాయంతో ఆమోదించిన అధికారిక ప్రకటన పర్యాటక రంగంలో బాధ్యతాయుతమైన, సురక్షితమైన, మానవకేంద్రిత కృత్రిమ మేధ, డిజిటల్ సాంకేతికతలు తీసుకురాగల సమూల మార్పులను గుర్తించింది. పర్యాటక ప్రణాళిక, పర్యాటక ప్రాంతాల నిర్వహణ, సందర్శకులకు సేవలు, బహుభాషా సమాచార ప్రసారం, ప్రయాణ సదుపాయాల కల్పన వంటి అంశాల్లో పరస్పర సహకారాన్ని ప్రోత్సహించేందుకు మద్దతు తెలిపింది.

ఇది సుస్థిర సమాజ కేంద్రిత పర్యాటకం, సహజ, సాంస్కృతిక వారసత్వ సంపద రక్షణ, పర్యాటక రంగంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, విభిన్న పర్యాటక ఉత్పత్తుల అభివృద్ధి ప్రచారంపై కూడా ఈ ప్రకటన ప్రత్యేకంగా దృష్టి సారించింది. బ్రిక్స్ సభ్య దేశాల మధ్య నిరంతర నైపుణ్యాభివృద్ధి, రీ స్కిల్లింగ్, పరిశ్రమ - విద్యా సంస్థల భాగస్వామ్యాలు, పర్యాటక రంగానికి సంబంధించిన డేటా, గణాంకాల మార్పిడి, అత్యుత్తమ విధానాల భాగస్వామ్యం, బలమైన ప్రజా సంబంధాల బలోపేతానికి ఇది ప్రాధాన్యతనిచ్చింది.

సమావేశంలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ మాటాడుతూ... 2047 నాటికి వికసిత్ భారత్ సాధించే ప్రయాణంలో పర్యాటక రంగం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రధాన ఆర్థిక కేంద్రాలకు మాత్రమే పరిమితమైన అభివృద్ధిని పట్టణాలు, గ్రామాలు, మారుమూల ప్రాంతాలకు విస్తరించే ప్రత్యేక సామర్థ్యం పర్యాటక రంగానికి ఉందని పేర్కొన్నారు. పర్యాటకం ద్వారా హోటళ్లు, హోమ్‌స్టేలు, ట్యాక్సీ నిర్వాహకులు, టూర్ గైడ్‌లు, కళాకారులు, చేనేత కార్మికులు, రైతులు, పారిశ్రామికవేత్తలకు అవకాశాలు లభిస్తున్నాయని, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆధారపడుతున్న లక్షలాది కుటుంబాల జీవనోపాధికి పర్యాటక రంగం తోడ్పడుతోందని తెలిపారు.

పర్యాటక రంగాన్ని ఆర్థికంగా సుసంపన్నంగా, పర్యావరణ పరంగా బాధ్యతాయుతంగా, సాంకేతికత ఆధారితంగా, సాంస్కృతికంగా ప్రామాణికంగా తీర్చిదిద్దేందుకు భారత్ చేస్తున్న కృషిని మంత్రి వివరించారు. "అంతిమంగా పర్యాటకం ప్రజలను అనుసంధానిస్తుంది. ఇది స్థానికులకు అవకాశాలను కల్పిస్తుంది. సాంస్కృతిక మార్పిడికి దోహదపడుతుంది. ప్రభుత్వాల మధ్య అధికారిక సంబంధాలకు అతీతంగా మన దేశాల ప్రజలు పరస్పరం ఒకరినొకరు అర్థం చేసుకునేందుకు పర్యాటకం వీలు కల్పిస్తుంది" అని అన్నారు.

పర్యాటక మంత్రుల సమావేశం సందర్భంగా బ్రెజిల్, ఇరాన్, దక్షిణాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దేశాలతో భారత్ ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహించింది. ఆయా దేశాల మంత్రుల నేతృత్వంలోని ప్రతినిధి బృందాలతో చర్చలతో పాటు, పర్యాటక రంగంలో పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ సమావేశాలు దోహదపడ్డాయి.

బ్రిక్స్ కు భారత్ అధ్యక్షతన కొనసాగిన పర్యాటక విభాగం కార్యక్రమాలపై విలేకరుల సమావేశం కూడా నిర్వహించారు. పర్యాటక శాఖ మంత్రుల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, జైపూర్ డిక్లరేషన్ ఆమోదం తదితర అంశాలను ఈ సందర్భంగా వెల్లడించారు.

జైపూర్‌లో జరిగిన పర్యాటక శాఖ మంత్రుల సమావేశంలో భాగంగా? స్థానిక సంప్రదాయ కళలు, హస్తకళలు, పర్యాటక కార్యక్రమాలకు చెందిన ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేశారు.

# పాపన్న చరిత్రను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి..

**-బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ప్రముఖ న్యూరో డాక్టర్ కృష్ణమూర్తి**

సంగారెడ్డి, ఆగష్టు 22:(నేటినిజం ప్రతినిధి): పాపన్న చరిత్రను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రముఖ న్యూరో డాక్టర్ కృష్ణమూర్తి అన్నారు. తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న బాక్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను డాక్టర్ కృష్ణమూర్తి శుక్రవారం సాయంం ప్రారంభించారు. సంగారెడ్డి పట్టణంలోని ఎం.ఎస్. క్రికెట్ అకాడమీలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో భాగంగా తేజ కాలేజీ, లా కాలేజీ జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌కు డాక్టర్ కృష్ణమూర్తి టాస్ వేసి శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించి ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాల్, తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ అధ్యక్షుడు బంగారు కృష్ణ, కార్యదర్శి చింతల సాయి కుమార్, ఎల్. వేణుగోపాల్, ప్రభాకర్ గౌడ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి పారవశ్యంలో బస్వాపూర్.. మిర్జాపూర్‌కు పాదయాత్ర

## -శ్రావణ శనివారం పురస్కరించుకుని వందలాదిగా తరలిన భక్తులు..

## -మార్మోగిన ఆంజనేయ, విఠల నామస్మరణ



కామారెడ్డి, ఆగష్టు 22:(నేటినిజం ప్రతినిధి): జుక్కల్ మండలంలోని బస్వాపూర్ గ్రామం భక్తి పారవశ్య-శ్రావణ శనివారం పురస్కరించుకుని వందలాదిగా తరలిన భక్తులు..

మార్మోగిన ఆంజనేయం, విఠల నామస్మరణంలో మునిగిపోయింది. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది నిర్వహించే సంప్రదాయంలో భాగంగా ఈసారి కూడా భక్తులు శ్రావణ శనివారం ఉదయం మద్నూర్ మండలంలోని మిర్జాపూర్‌లో ప్రసిద్ధిగాంచిన హనుమాన్ మందిరం వరకు వందలాదిగా పాదయాత్రగా బయలుదేరారు. శ్రీకిరణ్ మహారాజ్ ఆధ్వర్యంలో బస్వాపూర్ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి పాదయాత్ర భాజా, భజంత్రీలు, భజనలు, కీర్తనలతో ప్రారంభమైంది. ఆంజనేయ, విఠల, విఠల పాండురంగ నామస్మరణలతో గ్రామం మార్మోగింది.

గ్రామ ప్రముఖులు, గ్రామ పెద్దలు గ్రామ పొలిమేర వరకు వచ్చి భక్తులకు వీడ్కోలు పలికి పాదయాత్రను సాగనంపారు. పాదయాత్ర జుక్కల్, పెద్దఎడ్గి, సోమూర్ చౌరస్తా మీదుగా సాగగా ఆయా గ్రామాల ప్రజలు భక్తులకు ఘన స్వాగతం పలికారు. జుక్కల్ ఎస్సై మురళి సైతం పాదయాత్రలో పాల్గొని కొద్దిదూరం భక్తులతో కలిసి కాలినడకన నడిచారు. సోమూర్ చౌరస్తా వద్ద మాలిపటేల్ వీరభద్ర రచప్ప, తడ్గూర్ గ్రామంలో బస్వరాజ్ పటేల్ భక్తులకు నీరు, ఫలహారం, పండ్లు అందించారు.

హాండేకేలూర్, భక్తాపూర్ మీదుగా సాయంత్రానికి పాదయాత్ర మిర్జాపూర్‌లోని ప్రసిద్ధ ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకోనుంది. అక్కడ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, జలాభిషేకం, పుష్పాభిషేకం, హారతి నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ పాదయాత్రలో వందలాదిగా మహిళా భక్తులు పాల్గొన్నారు. జుక్కల్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన భజన మండళ్లు పాదయాత్రలో భక్తి కార్యక్రమాలతో

# ఉత్తరప్రదేశ్‌లో పాన్ మసాలాను, పొగాకును తయారు చేస్తున్న నెట్‌వర్క్ గుట్టు రట్టు చేసిన డీజీజీఐ

న్యూఢిల్లీ, ఆగష్టు 22:ఉత్తర ప్రదేశ్ లోని చిత్రకూట్, బాందా జిల్లాల్లో ఆరు చోట్లకు విస్తరించి ఉన్న పాన్ మసాలా, పరిమళ జర్దా, గుట్కాలను తయారు చేస్తున్న కేంద్రాల గుట్టును జీఎస్టీ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ (డీజీజీఐ) లఖ్‌నవూ జోనల్ యూనిట్టు రట్టు చేసింది. లక్నో జోనల్ యూని ట్టుకు అందిన నిర్దిష్ట రహస్య సమాచా రం ఆధారంగా, అధికా రులు అర్ధరాత్రి ఆయా చోట్ల సమన్వయ పూర్వక సోదాలు నిర్వహించారు. ఈ కేంద్రాలకు రెండు సంస్థలతో అనుబంధం ఉంది. వాటిలో ఒకటి మసాలా, తత్సంబ ంధిత ఉత్పాదనల తయారీలోనూ, మరొకటి వాణిజ్యంలో నిమగ్న మయ్యాయని బయటపడింది.

లెక్కల్లో చూపని 27 పౌచ్ ప్యాకింగ్ యంత్రాల జాడను సోదాల్లో గుర్తించారు. వాటిలో సుగంధ జర్దాకు సంబంధించిన 6 యంత్రాలు, పాన్ మసాలాకు సంబంధించినవి 9 యంత్రాలు, దోహరా, దేశీ గుట్కా కు సంబంధించిన 12 యంత్రాలు ఉన్నాయి. వక్కలను నూరే, కలిపే, ఎండబెట్టే యంత్రాలను కూడా చూశారు. ఈ క్రమంలో పాన్ మసాలా, నమిలే రకం పొగాకు, పరిమళభరిత జర్దా, సుగంధ భరిత వక్క నింపిన 15,50, 922 పొట్లాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. స్వాధీ నం చేసుకున్న ముడి పదార్థం, ప్యాకింగ్ సామగ్రిలో.. 32.9 మెట్రిక్ టన్ను (ఎమ్‌టీ)ల వక్క, పోకచెక్కలు, 2.8 ఎమ్‌టీల పొగా కు, 8.4 ఎమ్‌టీ ప్యాకింగ్ సామ గ్రి, పౌచ్ ం, పొరలు, 470 కిలో ల కథ్థా పొడి, 850 కిలోల గ్లిసరి న్, 5 45 కిలోల ఎసెన్సుతో పా టు ప్యాకింగ్ ప్రక్రియ పూర్తి కాని 25 6 కిలోల పాన్ మసాలా కూడా ఉంది.

# ప్రజల కోసం బాధ్యతగా, నమ్మకంగా పని చేస్తా..

## -ప్రజల ఆశీర్వాదమే నా బలం..

## -సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో మంత్రి జూపల్లి



మహబూబ్‌నగర్, ఆగష్టు 22: ప్రజలకు నమ్మకంగా, బాధ్యతగా, జవాబుదారీతనంతో పనిచేస్తానని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రజలే తన బలమని అన్నారు. ప్రజా సమస్యలు సత్వరం పరిష్కారం కావాలనే లక్ష్యంతో కొల్లాపూర్ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. వరుసగా మూడో రోజు నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి.. ఒకవైపు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూనే మరోవైపు ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు.

### స్టేడియాల నిర్మాణానికి కసరత్తు

కొల్లాపూర్ నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులు, యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేలా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో స్టేడియాల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా శనివారం పెంట్లవెల్లిలో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొల్లాపూర్ పట్టణంతో పాటు వీపనగండ్ల, పానగల్ మండలం కేతపల్లి గ్రామం, కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాల్లో స్టేడియాల నిర్మాణానికి కసరత్తు కొనసాగుతోందని తెలిపారు. ఈ ప్రక్రియ వివిధ దశల్లో ఉందని, అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. క్రీడా మౌలిక వసతులు అందుబాటులోకి వస్తే స్థానిక యువతకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.

### మ్యూటేషన్లకు ఏళ్ల తరబడి తిప్పించుకోవడమేంటి

అనంతరం పెంట్లవెల్లి మండల కేంద్రంలో ప్రజా సమస్యలపై అధికారులతో మంత్రి చర్చించారు. ప్రజలు, రైతులు తమ సమస్యలను మంత్రికి వివరించగా.. ఆయన ఓపికగా విని వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలపై పలువురు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మ్యూటేషన్ల కోసం దీర్ఘకాలంగా మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై మంత్రి జూపల్లి తీవ్రంగా స్పందించారు.

ఏళ్ల తరబడి ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వస్తే సత్వరం పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రెవెన్యూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

జవాబుదారీతనంతో పనిచేయాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, క్షేత్రస్థాయిలోనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే తన పర్యటనల ఉద్దేశమని మంత్రి తెలిపారు.

### ప్రజల ఆశీర్వాదమే బలం

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. 25 ఏళ్లకు పైగా రాజకీయాల్లో ఉన్నానని, ఏ రోజు ఎక్కడా అవినీతికి పాల్పడలేదని అన్నారు. ఇంచు భూమి కూడా కబ్జా చేయలేదని, ఏ పనికీ ఒక్క పైసా తీసుకోలేదని స్పష్టం చేశారు. జల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేస్తున్నానని, అందుకే ప్రజలు సుదీర్ఘకాలంగా తనను ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మరింత బాధ్యతగా పనిచేస్తానని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, క్షేత్రస్థాయిలోనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే తన పర్యటనల ఉద్దేశమని తెలిపారు.

# నాగర్ కర్నూల్ జూనియర్ కళాశాలకు కొత్త భవనం..



మహబూబ్‌నగర్, ఆగష్టు 22:రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కళాశాల ప్రాంగణం లో నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రవి ప్రకాష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా కూడా వ్యవహరిస్తూ విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. ఇంటర్మీడియట్, పదో తరగతి, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

1964లో నిర్మించిన నాగర్ కర్నూల్ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త భవనం నిర్మించాలని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, ఆయన తండ్రి ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు తెలిపారు. వారి విజ్ఞప్తి మేరకు ఇటీవల రూ.9 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. కొత్త కళాశాల భవన నిర్మాణానికి ప్రత్యేకంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

ఆధునిక పద్ధతుల్లో నిర్మించే ఈ భవనంలో తరగతి గదులు, ఆడిటోరియం, గ్రంథాలయం, క్రీడా మైదానం తదితర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. దాదాపు మూడు నెలలుగా భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం పనుల్లో పురోగతి కనిపిస్తోందని ఎమ్మెల్యే వివరించారు. విద్యా శాఖ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పనులను వేగవంతం చేసేందుకు ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డితో కలిసి కృషి చేస్తున్నామని తెలిపారు.

కళాశాల విద్యార్థులకు కంప్యూటర్ సౌకర్యం కోసం ఇటీవల రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సౌకర్యాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలో కళాశాల విద్యార్థులకు అల్పాహారం, భోజన సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని నాగర్ కర్నూల్ జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. తమ భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకుని ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు.

అనంతరం నిర్మాణంలో ఉన్న కళాశాల భవన పనులను పరిశీలించిన ఎమ్మెల్యే.. విద్యా శాఖ ఇంజనీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి వెంకటరమణ, మార్కెట్ చైర్మన్ రమణారావు, కౌన్సిలర్లు సింధు, చంద్రకళ, రాజేశ్వరి, శంకర్, కాజా ఖాన్, నిజాముద్దీన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జక్కరాజు, ఐటీ రమేష్, మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు పండ్లు, చీరల పంపిణీ

## సరిత తిరుపతయ్య దంపతుల పెళ్లిరోజు సందర్భంగా సేవా కార్యక్రమం



మహబూబ్‌నగర్, ఆగష్టు 22: రాష్ట్ర గొర్రెలు, మేకల కార్పొరేషన్ చైర్మన్, గద్వాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సరిత తిరుపతయ్య దంపతుల పెళ్లిరోజు సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బాలింతలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఎస్సీ సెల్ చైర్మన్ పసుల రాజు ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న సరిత తిరుపతయ్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజాసేవే ధ్యేయంగా సరిత తిరుపతయ్య సూచనల మేరకు పేద ప్రజలకు అండగా నిలిచేలా బాలింతలకు చీరలు, పండ్లు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా పేద ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు సరిత తిరుపతయ్య దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం నాయకులు నవనీత, ఉషారాణి, జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ యాదవ్, చెక్కల దినేష్, బొర్ర సురేష్, అంజి, సామెల్, బీమ్‌రెడ్డి, దండు దేవన్న, హరీష్, బాలానగర్ మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బాలానగర్ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివలింగం, యువజన కాంగ్రెస్ జడ్చర్ల నాయకులు లింగేశ్వర్‌జీ, మురళి, వినయ్, కోట్ల దామోదర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, పసుల శ్రీకాంత్, మొగులయ్య, వెంకటయ్య, సర్పంచ్ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి..

## -విద్యలో జిల్లాను రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్థానంలో నిలపాలి




మహబూబ్‌నగర్, ఆగష్టు 22:ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడంతో పాటు వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. విద్యలో జిల్లాను రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం కార్యక్రమంలో విద్యార్థుల ప్రగతి, డి-గ్రేడ్‌లో ఉన్న విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదల, ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు చేయూత పింఛన్, ప్రభుత్వ పాఠశాలల పనితీరు గ్రేడింగ్ సూచిక, రాజీవ్ విద్యా దీవెన పథకం ద్వారా ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉపకార వేతనాలపై శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన విద్యాశాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ప్రజావాణి సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ సమావేశానికి మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పరిస్థితి, హాజరు, అభ్యసన స్థాయి, పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం కార్యక్రమం అమలు తీరు, పాఠశాలల పనితీరు గ్రేడింగ్ సూచికలో ప్రగతి, విద్యార్థులకు అందుతున్న సంక్షేమ పథకాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని మరింత పెంచేందుకు మండల స్థాయి అధికారులు, పర్యవేక్షణ బృందాలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

విద్యార్థుల నమోదు విషయంలో పాఠశాలల వారీగా పరిస్థితిని పరిశీలించి తక్కువ నమోదు ఉన్న పాఠశాలలను గుర్తించాలని అన్నారు. ఆయా ప్రాంతాల్లో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్య, మౌలిక వసతులు, నాణ్యమైన బోధనపై అవగాహన కల్పించి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక నైపుణ్యాలు అలవడేలా చూడాలని కలెక్టర్ అన్నారు. విద్యా ప్రమాణాలు సాధించలేకపోతున్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన అందించాలని సూచించారు. ప్రత్యేకంగా డి-గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులపై ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని అన్నారు. పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం కార్యక్రమం ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచాలని ఆదేశించారు.

ఎస్టీ విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజీవ్ విద్యా దీవెన పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వివిధ ఉపకార వేతనాలు అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజి, లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, నూరుద్దీన్, మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సంబంధిత శాఖల వార్డెన్లు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్1ఎన్1 ఇన్‌ఫ్లుయెంజా సన్నద్ధతపై కేంద్ర వైద్యశాఖ మంత్రి జేపీ నడ్డా సమీక్ష.. నిరంతర అప్రమత్తత, పటిష్ట నిఘాకు ఆదేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 22:దేశంలో, ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో హెచ్1ఎన్1 ఇన్‌ఫ్లూయెంజా పరిస్థితి, సన్నద్ధతపై నేడు కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖమంత్రి శ్రీ జేపీ నడ్డా సమీక్ష నిర్వహించారు. ఢిల్లీ వైద్యశాఖ మంత్రి డాక్టర్ పంకజ్ కుమార్ సింగ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

వ్యాధిపై జాతీయ స్థాయి నిఘా, అంటువ్యాధుల వ్యాప్తిని, ఇన్‌ఫ్లూయెంజా వంటి అనారోగ్య లక్షణాలు (ఐఎల్ఐ), తీవ్రమైన శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల (ఎస్ఏఆర్ఐ) ధోరణులు, పరీక్షలు, ప్రయోగశాల పర్యవేక్షణ, సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా కేసులను నిర్వహించేందుకు వైద్య సంరక్షణ కేంద్రాల సన్నద్ధతను కేంద్ర వైద్యశాఖ మంత్రి సమీక్షించారు. ఇన్‌ఫ్లూయెంజా ధోరణులను నిరంతరం పర్యవేక్షిస్తూ, కేసుల్లో అసాధారణ పెరుగుదల లేదా ఒకే ప్రాంతంలో అధిక సంఖ్యలో కేసులు నమోదైనప్పుడు వాటిని సకాలంలో గుర్తించి, తగిన చికిత్స అందించేందుకు నిరంతర అప్రమత్తత, పటిష్ట నిఘా, ముందస్తు సన్నద్ధత అవసరమని శ్రీ జేపీ నడ్డా స్పష్టం చేశారు.

ఢిల్లీలోని వైద్య సంరక్షణ కేంద్రాల సన్నద్ధతపై కూడా కేంద్రమంత్రి సమీక్షించారు. ఆసుపత్రి పడకలు, అత్యవసర చికిత్సా సదుపాయాలు, ఆక్సిజన్ సదుపాయం కలిగిన పడకలు, వెంటిలేటర్లు, అవసరమైన మందులు, వ్యాధి నిర్ధారణ సదుపాయాలు, ఇతర కీలక సామగ్రి లభ్యతను పరిశీలించారు. ముఖ్యంగా ప్రత్యేక లేదా అత్యవసర చికిత్స అవసరమయ్యే రోగులకు తగినన్ని అదనపు సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడటం, ఆసుపత్రుల మధ్య రోగుల తరలింపులో ఎలాంటి అంతరాయం లేకుండా సమర్థవంతమైన రిఫరల్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ముఖ్యమని తెలిపారు.

ఇన్‌ఫ్లూయెంజా కేసులను సత్వరంగా గుర్తించడం, సమయానికి పరీక్షలు నిర్వహించడం, తగిన వైద్య నిర్వహణ వంటి అంశాలను మరింత బలోపేతం చేయాలని, ఇప్పటికే ఉన్న నిఘా, ప్రయోగశాలల వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని కేంద్ర వైద్యశాఖ మంత్రి సూచించారు.

అంతకుముందు 2026 జూలై 10న అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర వైద్యశాఖ కార్యదర్శి ప్రత్యేక లేఖ రాశారు. తీవ్రమైన శ్వాసకోశ సంబంధిత వ్యాధులపై (ఏఆర్ఐ) సన్నద్ధత, నిఘాను మరింత బలోపేతం చేయాలని, వైద్య సంరక్షణ కేంద్రాల్లో సౌకర్యాలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని లేఖలో సూచించారు.

# చంద్రయాన్ విజయోత్సవం .. భారతావనికి గర్వ కిరీటం

భారతదేశం శాస్త్రసాంకేతిక రంగంలో సాధించిన విజయాలలో అంతరిక్ష పరిశోధనకు ఒక ప్రత్యేక గౌరవ స్థానం ఉంది. ప్రపంచం లోని అగ్రరాజ్యాల సరసన నిలబడి, స్వంత ఉపగ్రహాలను ప్రయోగించి, చంద్రుడి వైపు దూసుకెళ్లిన భారత్, 2023 ఆగస్టు 23న ఒక అపూర్వ ఘట్టాన్ని సృష్టించింది. ఆ రోజు చంద్రయాన్-3 విజయవంతంగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగింది.

ఇది భారత అంతరిక్ష పరిశోధన చరిత్రలో మాత్రమే కాకుండా, ప్రపంచ అంతరిక్ష చరిత్రలోనూ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన ఘనత. ఈ సంఘటనకు గుర్తుగా భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 23న "జాతీయ అంతరిక్ష దినోత్సవం" గా జరుపుకోవాలని నిర్ణయించింది.

భారత అంతరిక్ష పరిశోధన ప్రయాణం 1962లో విక్రమ్ సారాభాయ్ దూరదృష్టితో ప్రారంభమైంది. 1975లో తొలి ఉపగ్రహం ఆర్యభటను కక్ష్యలో ప్రవేశపెట్టడం ద్వారా భారత్ అంతరిక్ష శాస్త్రంలో తన అడుగులు వేసింది. అప్పటి నుంచి ఇస్రో వందలాది ఉపగ్రహాలను ప్రయోగిస్తూ వాతావరణ అంచనాలు, టెలి కమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్, వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో అపారమైన సహకారం అందిస్తోంది. 2013లో మంగళ యాన్ మిషన్ విజయంతో అమెరికా, రష్యా, యూరప్ తరువాత మంగళ గ్రహాన్ని చేరుకున్న నాలుగో దేశంగా భారత్ నిలిచింది. ఈ మిషన్ కేవలం 450 కోట్ల రూపాయల వ్యయంతో పూర్తయి, ప్రపంచాన్ని ఆశ్చర్య పరిచింది.

2023లో చంద్రయాన్-3 మిషన్ ద్వారా భారత్ మరొక మైలురాయిని చేరుకుంది. అమెరికా, రష్యా, చైనా తరువాత చంద్రుడి మీద దిగిన నాలుగో దేశం భారత్. కానీ చంద్రుడి దక్షిణ ధ్రువంలో విజయవంతంగా ల్యాండింగ్ చేసిన ప్రపంచంలోనే మొదటి దేశం భారత్ కావడం ఈ విజయానికి అపూర్వతను తెచ్చింది. 3.84 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న చంద్రునిపై "విక్రం ల్యాండర్" క్షణాల్లో సాఫల్యంగా దిగడం, "ప్రజ్ఞాన్ రోవర్" పరిశోధనలకు శ్రీకారం చుట్టడం, చంద్రుని

## ఆగస్టు 23...జాతీయ అంతరిక్ష దినోత్సవం




ఉపరితలంలో సల్ఫర్, అల్యూమినియం, కాల్షియం, ఇనుము వంటి మూలకాల జాడలు గుర్తించడం వంటి విజయాలు ప్రపంచాన్ని భారత ప్రతిభ వైపు మరల్చాయి. ఇది కేవలం 615 కోట్ల రూపాయల వ్యయంతో పూర్తవడం, అమెరికా లేదా రష్యా మిషన్ల ఖర్చుతో పోలిస్తే చాలా తక్కువ కావడం ఇస్రో సామర్థ్యానికి నిదర్శనం.

ఈ విజయాన్ని గుర్తు చేసుకోవడమే కాక, దేశ భవిష్యత్తు తరాలకు ప్రేరణనివ్వడం కోసం ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకోవడం నిర్ణయాత్మకం. ఈ దినోత్సవం శాస్త్రవేత్తల అంకితభావానికి గౌరవం మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో శాస్త్రాసక్తిని పెంపొందించే అవకాశం కూడా. పాఠశాలలు, కళాశాలల్లో శాస్త్ర ప్రదర్శనలు, వ్యాసరచన పోటీలు, ఖగోళ పరిశీలన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతకు పరిశోధనా తపన కలిగించవచ్చు.

అంతరిక్ష సాంకేతికత కేవలం శాస్త్ర ప్రగతికే పరిమితం కాదు; అది సామాజిక-ఆర్థిక అభివృద్ధికి మూల స్తంభం. ఉపగ్రహాల సహాయంతో గ్రామీణ ప్రాంతాల్లో టెలి మెడిసిన్, ఆన్‌లైన్ విద్య, వాతావరణ హెచ్చరికలు అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయ రంగంలో రిమోట్ సెన్సింగ్ ద్వారా పంటల స్థితి, నీటి వనరుల వినియోగం సమర్థవంతంగా జరుగుతోంది.

భవిష్యత్తులో గగన యాన్ మిషన్ ద్వారా భారతీయ వ్యోమగాములు అంతరిక్షంలోకి అడుగుపెట్ట బోతున్నారు. అలాగే శుక్రయాన్, అదిత్య-ఎల్1 (సూర్య పరిశోధన), మరికొన్ని మార్స్, వెనస్ మిషన్లు కూడా రూపుదిద్దు కుంటున్నాయి.

అందువల్ల జాతీయ అంతరిక్ష దినోత్సవం ఒక జ్ఞాపక దినం మాత్రమే కాదు, అది భారత శాస్త్ర స్ఫూర్తికి ప్రతీక, భవిష్యత్ తరాలకు ఒక దిక్సూచి. విక్రమ్ సారాభాయ్ ప్రారంభించిన యాత్రను ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహానుభావులు కొనసాగించారు. ఇప్పుడు ఈ వారసత్వాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు కొత్త ఎత్తులకు తీసుకెళ్తున్నారు. ఆగస్టు 23 మన జ్ఞాపకాల్లో ఎప్పటికీ నిలిచిపోయే "భారత అంతరిక్ష గౌరవ దినం".



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# పరిశుభ్రతతో పాటు పచ్చదనం పెంపు

## -ఎస్పీ మహేష్ బి గితే




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 22: (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రత, వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొని పోలీస్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యాలయ పరిసరాల్లోని చెత్త, పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా, వచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణంగా మార్చడం ద్వారా పోలీస్ సిబ్బందితో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజలకు సైతం మెరుగైన వాతావరణం కల్పించవచ్చన్నారు. మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో ఆర్ఐలు మధుర్, సురేష్, రమేష్, సీఐలు మొగిలి, మధుకర్, ఎస్ఐ కిరణ్‌కుమార్, ఆర్ఎస్ఐలు రాజు, శ్రవణ్, సాయికిరణ్, దిలీప్, రాజుతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట డిప్లమా విద్యార్థుల ఆందోళన..

వరంగల్, ఆగష్టు 22: డిప్లమా, పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టేందుకు విద్యార్థులు పూనుకున్నారు. డిప్లమా పూర్తిచేసిన తర్వాత ఈసెట్ ద్వారా నేరుగా బీటెక్‌లో చేరే అవకాశాన్ని కొనసాగించాలని, డిప్లమా కోర్సును ఐటీఐతో విలీనం చేయొద్దని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పాలిటెక్నిక్, డిప్లమా విద్యార్థులందరినీ క్రిమినల్ మైండ్‌సెట్ ఉన్నవారిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రీకరించడం సరికాదని విద్యార్థులు మండిపడ్డారు. ఫారం కూడా నింపలేరంటూ తమపై వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తమ సామర్థ్యాన్ని తెలుసుకోవాలంటే తమ వద్దకు వచ్చి పరీక్ష పెట్టాలని సవాల్ చేశారు. డిప్లమా చదివిన విద్యార్థులే పెద్ద నిర్మాణాలు, వంతెనలు, బ్యారేజీల నిర్మాణాల్లో సాంకేతిక నైపుణ్యంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

డిప్లమా పూర్తిచేసిన తర్వాత ఈసెట్ ద్వారా నేరుగా బీటెక్‌లో చేరే అవకాశాన్ని తొలగించవద్దని విద్యార్థులు కోరారు. ఈసెట్ అవకాశాన్ని రద్దు చేస్తే మరో రెండేళు ఇంటర్ చదవాల్సి వస్తుందని, దీంతో విద్యాభ్యాసానికి అదనపు సమయం పడటమే కాకుండా భవిష్యత్తు ప్రణాళికలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్లమా తర్వాత వెంటనే ఈసెట్ రాయవచ్చా? లేక రెండేళ్లు పనిచేసిన తర్వాతే పరీక్ష రాయాలా? అనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనకు ఏఐఎస్ఏ, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ తదితర విద్యార్థి, యువజన సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఆయా సంఘాల నాయకులు, ప్రతినిధులు విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. దీంతో పోలీసులు వారిని అక్కడి నుంచి అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే నిరసన చేపట్టామని విద్యార్థులు తెలిపారు. ఎవరినీ ఇబ్బంది పెట్టడం, గొడవలు చేయడం తమ ఉద్దేశం కాదన్నారు. ఇప్పటికే కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినా స్పష్టమైన స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమను డిప్లమా కోర్సుల్లో చేర్పించారని, ఇప్పుడు తమ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం తమను లక్ష్యంగా చేసుకోకుండా సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. డిప్లమా విద్యార్థుల భవిష్యత్తుపై స్పష్టమైన ప్రకటన చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట నిరసన కొనసాగిస్తూ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఇంపీరియల్ కాలేజీతో తెలంగాణ విద్యా భాగస్వామ్యం

-షార్ట్‌టర్మ్ కోర్సులు, పరిశోధన, విద్యారి-అధ్యాపకుల మార్పిడిపై చర్చలు..

-'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు ప్రతినిధులకు ఆహ్వానం

-తెలంగాణలో ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాల నిర్వహణకు అవకాశాల పరిశీలన

-విద్య, పరిశోధన రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్యాలకు మరో ముందడుగు



లండన్, ఆగష్టు 22: తెలంగాణను అంతర్జాతీయ విద్యా, పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా మరో కీలక అడుగు పడింది. లండన్‌లోని ప్రతిష్ఠాత్మక ఇంపీరియల్ కాలేజ్ లండన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సందర్శించారు. ఈ సందర్భంగా కాలేజీ ఉన్నతాధికారులతో సమావేశమై తెలంగాణలో విద్య, పరిశోధన, సాంకేతిక రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు. ఇంపీరియల్ కాలేజ్ అధ్యక్షుడి చీఫ్ ఆఫ్ స్టాఫ్, వ్యూహాత్మక భాగస్వామ్యాల విభాగం వైస్ ప్రెసిడెంట్ అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా, ఆస్ట్రలేషియా ప్రాంతాల సీనియర్ అంతర్జాతీయ సంబంధాల మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో కె. రామకృష్ణారావు సమావేశమయ్యారు. తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఉన్న వివిధ అవకాశాలపై ఈ సందర్భంగా చర్చించారు.

### హైదరాబాద్‌లో షార్ట్‌టర్మ్ కోర్సులు

తెలంగాణ, హైదరాబాద్‌లో స్వల్పకాలిక కోర్సులు, కార్యనిర్వాహక విద్యా కార్యక్రమాలను నిర్వహించే అవకాశాలను పరిశీలించేందుకు ఇంపీరియల్ కాలేజ్ ఆసక్తి చూపినట్లు అమాండా తెలిపారు. రాష్ట్రంలోని విద్యా, పారిశ్రామిక, పరిశోధన రంగాల అవసరాలకు అనుగుణంగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించే అవకాశాలపై ముందుకు సాగనున్నట్లు వెల్లడించారు.

పరిశోధన, విద్యార్థుల మార్పిడిపై ఆసక్తి

పరిశోధన రంగంలో భాగస్వామ్యంతో పాటు విద్యార్థులు, అధ్యాపకుల పరస్పర మార్పిడి కార్యక్రమాల్లోనూ తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఇంపీరియల్ కాలేజ్ ఆసక్తి వ్యక్తం చేసింది. అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థతో ఇలాంటి భాగస్వామ్యం రాష్ట్రంలోని విద్యార్థులు, అధ్యాపకులకు కొత్త అవకాశాలను అందించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

### గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం

హైదరాబాద్‌లో డిసెంబరు 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు ఇంపీరియల్ కాలేజ్ ప్రతినిధులను కె. రామకృష్ణారావు ఆహ్వానించారు. తెలంగాణలో పెట్టుబడులు, పరిశోధన, సాంకేతికత, విద్యా రంగాల్లో ఉన్న అవకాశాలను సమ్మిట్ వేదికగా పరిశీలించాలని కోరారు.

సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, వైద్య రంగాలతో పాటు వ్యాపార విద్యలోనూ ఇంపీరియల్ కాలేజ్‌కు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. ఇలాంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థతో తెలంగాణ భాగస్వామ్య అవకాశాలపై చర్చలు జరగడం రాష్ట్ర విద్యా రంగానికి ప్రాధాన్యమైన పరిణామంగా భావిస్తున్నారు. విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలను విస్తరించడం ద్వారా హైదరాబాద్‌ను మరింత బలమైన అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఏర్పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

# '2026 టెరియర్ సైబర్ క్వెస్ట్'ను ప్రారంభించిన భారత సైన్య టెరిటోరియల్ ఆర్మీ

న్యూఢిల్లీ, ఆగష్టు 22:'2026 టెరియర్ సైబర్ క్వెస్ట్' (టీసీక్యూ 3.0)ను సైబర్‌పీస్ సహకారంతో టెరిటోరియల్ ఆర్మీ ప్రారంభించింది. రక్షణ, సైబర్ భద్రత, సమాచార రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లకు వినూత్న పరిష్కారాలను కనుగొనాలన్న ధ్యేయంతో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి హ్యాకథాన్ ఈ '2026 టెరియర్ సైబర్ క్వెస్ట్'.

విద్యారంగం, పారిశ్రామిక రంగం, పరిశోధన సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, సాయుధ దళాలకు చెందిన సాంకేతిక ప్రతిభావంతులతో ఈ పోటీకి సంబంధించిన మూడో సంచికలో భాగంగా ఓ సమావేశాన్ని నిర్వహించాలని భారతీయ సైన్యం సంకల్పించింది. కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ భద్రత, ముప్పును తగ్గించడం, డిజిటల్ మాధ్యమం పట్ల చైతన్యాన్ని పెంపొందించడం వంటి సరికొత్త రంగాలపై ఈ కార్యక్రమంలో దృష్టిని కేంద్రీకరిస్తారు. జాతీయ భద్రతకు సంబంధించిన స్వదేశీ పరిష్కారాలను అభివృద్ధిపరిచే ప్రయత్నాలను కూడా ఈ కార్యక్రమ నిర్వహణ ద్వారా ప్రోత్సహిస్తారు.

ఇప్పటి వరకు నిర్వహించిన పోటీల నుంచి స్ఫూర్తిని పొంది, ఈ కింద ప్రస్తావించిన మూడు పోటీ విభాగాల్లో 'టీసీక్యూ 3.0'ను నిర్వహించనున్నారు:

'బగ్ హంటింగ్': ఇది సైబర్ భద్రతతో ముడిపడిన ఒక సవాలు. దీనిని ఆన్‌లైన్ క్యాప్చర్-ది-ఫ్లాగ్ (సీఎఫ్‌టీ) క్వాలిఫయర్‌తో మొదలుపెడతారు. లైవ్ శాండ్‌బాక్స్ ఫైనల్‌తో ముగిస్తారు. దీనిలో పాల్గొనే వారు కీలక మౌలిక సదుపాయాలతో కూడిన కల్పిత వాతావరణం (సిమ్యులేటెడ్ ఎన్విరాన్‌మెంట్స్)లో సంభావిత బలహీనతలను గుర్తించి వాటి వివరాలను దస్తావేజుల రూపంలో పొందుపరచాల్సి ఉంటుంది.

'ఏఐ కవచ్': ఇది కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్‌లపై ఆధారపడిన సవాలు. దీనిలో.. రాబోయే కాలంలో తలెత్తే ముప్పులను అంచనా వేసి ఆటోమేటెడ్ రక్షణ యంత్రాంగాలు, వ్యత్యాసాల గుర్తింపునకు సంబంధించిన పరిష్కారాలను కనుగొనవలసి ఉంటుంది.

'క్రియేటర్స్ చాలెంజ్': ఇది కంటెంటును రూపొందించే వారిని, కమ్యూనికేటర్లని, ఇన్‌ఫ్లుయెన్సర్లని ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన డిజిటల్ మీడియా ఆధారిత, స్టోరీ టెల్లింగ్ పోటీ. దీనిలో డీప్‌ఫేక్, ఫిషింగ్, ఆన్‌లైన్ స్కాములు, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేయడం వంటి డిజిటల్ మాధ్యమ ప్రధాన ముప్పుల పట్ల చైతన్యాన్ని పెంపొందించడానికి ప్రభావశీల ప్రచార ఉద్యమాల్ని రూపొందించాల్సి ఉంటుంది.

ఈ పోటీలో పాల్గొనడానికి నమోదు కార్యక్రమాన్ని 2026 ఆగస్టు 31 వరకూ చేపడతారు. ఆన్‌లైన్ మాధ్యమంలో ఎంపిక ప్రక్రియను 2026 సెప్టెంబరు 1 మొదలు 10 వరకూ, గ్రాండ్ ఫినాలేను 2026 అక్టోబరు 6 నుంచి 8 వరకూ న్యూఢిల్లీలో నిర్వహిస్తారు. పురస్కారాల కార్యక్రమాన్ని 2026 ఆగస్టు 9న నిర్వహిస్తారు.

# వేలేరు మండలానికి సాగునీరు అందించాలని ఎమ్మెల్యే శ్రీహరికి వినతి



వరంగల్, ఆగష్టు 22:వరంగల్ జిల్లా వేలేరు మండలంలోని రైతులకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకులు, రైతులు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి శనివారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని సాగు భూములకు గోదావరి జలాలు అందేలా పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులను వేగవంతం చేయాలని కోరారు.

వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత పరిష్కారం కోసం ఎత్తిపోతల పథకాలు, పైప్‌లైన్, కాలువల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వేలేరు మండలానికి గండి రామారం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు అందించి రెండు పంటలకు సాగునీరు కల్పిస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇచ్చిన హామీని గుర్తు చేశారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారావు, సర్పంచ్ మరిజె అనిత, నాయకులు విజేందర్ రెడ్డి, జానీ, హరీఫ్ పాల్గొన్నారు.

# సొంతంగా శ్వాస తీసుకుంటున్న పక్షవాత బాధితుడు

## - ముంబై వైద్యుల అద్భుత చికిత్స

హైదరాబాద్, ఆగష్టు 22: న్యూరో-రిహాబిలిటేషన్ రంగంలో అద్భుత విజయం నమోదైంది. మెడ భాగంలోని వెన్నుపాముకు (సెర్వైకల్ స్పైనల్ కార్డ్) తీవ్ర గాయం కావడంతో ఆరు నెలలుగా వెంటిలేటపైనే ఆధారపడిన 38 ఏళ్ల వ్యక్తికి ముంబై సెంట్రల్‌లోని వోక్‌హార్డ్ హాస్పిటల్స్ వైద్యుల కృషితో సొంతంగా శ్వాస తీసుకోగలిగారు. హైదరాబాద్‌కు చెందిన ఈ బాధితుడు ఒక ప్రమాదంలో మెడ వెన్నుపాముకు తీవ్ర గాయం కావడంతో మెడ కింద భాగం పూర్తిగా పక్షవాతానికి గురైంది. ఈ గాయం కారణంగా ఆయన కాళ్లు, చేతుల్లో కదలికలు, స్పర్శ పూర్తిగా పోయాయి. అన్నింటికంటే ముఖ్యంగా సొంతంగా శ్వాస తీసుకునే సామర్థ్యాన్ని కూడా కోల్పోయాడు. హైదరాబాద్‌లోని ఒక ఐసీయూలో చేరిన ఆయన దాదాపు రెండు నెలల పాటు నిరంతరం వెంటిలేటర్ మద్దతుపై ఉన్నారు. పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినా, దాదాపు ఆరు నెలల పాటు కృత్రిమ శ్వాసపైనే ఆధారపడాల్సి వచ్చింది. దీర్ఘకాలం పాటు వెంటిలేటర్‌పై ఉండక తప్పదని వైద్యులు ఆ కుటుంబానికి తెలియజేశారు. మరిన్ని చికిత్సా మార్గాలను అన్వేషించాలనే సంకల్పంతో ఆ కుటుంబం ముంబై సెంట్రల్‌లోని వోక్‌హార్డ్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ కన్సల్టెంట్ ఫంక్షనల్ న్యూరోసర్జన్ డాక్టర్ మనీష్ బాల్దియాను సంప్రదించింది. అధునాతన న్యూరోమాడ్యులేషన్, ఫ్రెనిక్ నర్వ్ స్టిమ్యులేషన్ ప్రక్రియల్లో ఆయన నిపుణులుగా పేరుపొందారు. పూర్తి స్థాయి వైద్య పరీక్షల అనంతరం, ప్రత్యేక వైద్య పర్యవేక్షణలో రోగిని ముంబైకి తరలించారు. వెంటిలేటర్ మద్దతును క్రమంగా తగ్గించే ప్రయత్నాలు చేయగా, శరీరంలో ప్రమాదకర స్థాయికి కార్బన్ డయాక్సైడ్ నిల్వలు పెరిగినట్లు తేలింది. దీన్నిబట్టి ఆయన ఇంకా సొంతంగా తగినంత శ్వాస తీసుకోలేకపోతున్నాడని స్పష్టమైంది. రోగి పరిస్థితిని మదింపు చేసిన తర్వాత డాక్టర్ మనీష్ బాల్దియా అత్యంత ప్రత్యేకమైన



'ఫ్రెనిక్ నర్వ్ స్టిమ్యులేషన్' శస్త్రచికిత్సను నిర్వహించారు. శ్వాసక్రియకు కీలకమైన ఫ్రెనిక్ నాడిని ఉత్తేజపరచడం ద్వారా డయాఫ్రాగమ్‌ను (డయాఫ్రమ్ కండరాన్ని) ప్రేరేపించేందుకు ఈ అధునాతన చికిత్సా విధానాన్ని రూపొందించారు. ఈ చికిత్సకు అద్భుతమైన ఫలితం లభించింది. ప్రక్రియ పూర్తయిన కేవలం 3 నుంచి 4 రోజుల్లోనే రోగిలో మెరుగుదల కనిపించడం ప్రారంభమైంది. మూడో వారం నాటికి అతని ఆరోగ్యం నిలకడగా మారడంతో ఐసీయూ నుంచి బయటకు తరలించారు.

ఈ సందర్భంగా వోక్‌హార్డ్ హాస్పిటల్స్ ముంబై సెంట్రల్ కన్సల్టెంట్ ఫంక్షనల్ న్యూరోసర్జన్ డాక్టర్ మనీష్ బాల్దియా మాట్లాడుతూ మెడ పైభాగంలోని వెన్నుపాముకు తీవ్ర గాయాలైనప్పుడు మెదడుకు, శ్వాసకోశ కండరాలకు మధ్య ఉండే సంకేతాల సమన్వయం దెబ్బతింటుందన్నారు. ఫ్రెనిక్ నర్వ్ స్టిమ్యులేషన్ ద్వారా ఆ అంతరాయాన్ని అధిగమించి డయాఫ్రాగమ్‌ను నేరుగా ఉత్తేజపరుస్తామన్నారు. దీని వల్ల రోగి క్రమంగా సొంతంగా శ్వాస తీసుకునే సామర్థ్యాన్ని తిరిగి పొందగలుగుతారన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.